వి.నా.వే 14 NPRO IB309 C

కుల వ్యవస్థ

రచన :

శ్రీ తుమ్మల

హాయా స్మారక పరిచారణాలు
కాళేశ్వరరావురోడ్, విజయవాడ-2

CT

NPR01B309

కులవ్యవస్థ

రచన :

శ్రీ తుమ్మల

లోహియా స్మారక ప్రచురణలు
కాళేశ్వరరావురోడ్, విజయవాడ-2

ప్రథమ

ముద్రణ :

అక్టోబర్ 73


రు. 2-00

శ్రీ ప్రింటర్స్.

విజయవాడ-2

B

అవిష్కరణ



శ్రీ మధులిమయే, ఎం. పి.

11-10-73, విజయవాడ

301.44 TUM
5908

రచయిత ...

ఈ పుస్తకము రచయిత శ్రీ తుమ్మల చౌదరి. వీరు 1940 సం॥లో కృష్ణాజిల్లా, గుడివాడ తాలుకా జమీ గొల్వేపల్లి గ్రామములో జన్మించిరి. శ్రీ తుమ్మల తన 17వ ఏటనే డెమాక్రటిక్ స్టూడెంట్సు యూనియన్ ద్వారా ప్రజా రంగానికి సోషలిస్టు యుద్యమానికి సన్నిహితులుగా నున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంనుండి "యం.ఏ" (రాజ నీతి, చరిత్ర) డిగ్రి పొందారు.

సోషలిస్టు పార్టీలో 1961 లో జేరారు. నాటినుండి నేటివరకు వివిధ బాధ్యతలతో సోషలిస్టు భావాలను, ప్రత్యే కముగా లోహియా సిద్ధాంతములను ఆంధ్రప్రజలకు అందిస్తూ ప్రజారంగములో పనిచేస్తున్న బహుకొద్దిమంది నిస్వార్థులలో ఆయనొకరు.

"ఆంధ్రుల హక్కు - విశాఖ ఉక్కు" ఉద్యమములో రాష్ట్రమంతట తిరిగి సోషలిస్టుగా తన కర్తవ్యమును నిర్వ హించారు. చీరాలలో జరిగిన భూ ఆక్రమణ ఉద్యమములో కూడా పాల్గొనిరి. డిల్లీలో నిర్వహించిన ప్రజాప్రదర్శనములో లాటీ దెబ్బలకు గురియైరి.

ప్రత్యేకాంధ్ర రాష్ట్రోద్యమంలో చాలా చొరవగా పని చేసిన వ్యక్తి. ప్రస్తుతం ఆంధ్ర ప్రజాపరిషత్తుకు

జై ఆంధ్రా ఫ్రంట్‌కు కార్యదర్శి– సోషలిస్టుపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు. వీరిని జై ఆంధ్ర ఉద్యమములో డిటె న్యూగా జైలులో పెట్టిరి.

గతంలో డాక్టరు లోహియా సాహిత్యాన్ని వీరు అనువదించగా ఆంధ్ర ప్రజలకు అందించియున్నాము. వీరి స్వంత రచనలను గూడా ప్రచురించితిమి. నేటి సమస్యలపై వీరువ్రాసిన అనేక రాజకీయ వ్యాసములు వారపత్రికలలో గూడా ప్రచురింపబడుతున్న విషయం ఆంధ్ర పాఠక లోకా నికి తెలియనిదికాదు. రచయితగానే కాకుండా మంచి ఉప న్యాసకుడుగా గూడా అందరికి పరిచయమే.

"కుల వ్యవస్థ" అను ఈ పుస్తకమును పాఠక లోకము నకు అందించుటలో ముఖ్యకారణ మేమన డా|| లోహియా దేశంలో నున్న అగ్రకులాలు (పాలక వర్గాలు) వెనుక బడిన కులాల వారిని ఎలా అణగద్రొక్కుతున్నారో హెచ్చరించి యున్నారు. అట్టి భావాలను ఎంతవరకు ఈ పుస్తకము ద్వారా అందించారో మీరే నిర్ణయించండి. వీరి జైలీని గురించి గూడా మేము పరిచయం చేయవల్సినలేదు. పాఠ కులే దానికి నిర్ణేతలు.

ప్రచురణకర్తలు

కృతజ్ఞతలు

కుల వ్యవస్థను గురించిన ఈ చిన్న పుస్తకములో ఆ వ్యవస్థ పుట్టుక గురించిన వివిధ సిద్ధాంతాలను, ఆ వ్యవస్థను గురించి రకరకాల భావధోరణులను స్థూలంగా వివరించడానికి ప్రయత్నించాను. అందులో నేనెంతవరకు నెగ్గానో నిర్ణయించ వలసినది పాఠకులే.

తక్కువ సమయంలోనే ప్రింపడి . చక్కగా ముద్రించి యిచ్చిన శ్రీ ప్రింటర్స్, విజయవాడ వారికి, గ్రంథరచనలో తమ అమూల్యమైన సలహాలతో ప్రోత్సహించిన సురమౌళి, రావెల సోమయ్య, తుమ్మూరి శివరామకృష్ణయ్య లకు కృతజ్ఞుడను. ప్రూఫ పతికి తుది మెరుగులు దిద్దే సమయంలో మిత్రుడు నాయుడు సాంబశివరావు సహాయము మరువలేనిది.

ఆవిష్కర్త క్రామేడ్ మధులిమయేకు విప్లవాభినందనలు.

పుస్తక రచనకు తగిన ఉత్సాహాన్ని, ఆవేశాన్ని నేను ఎవరినుండి పొందినానో ఆ మహావ్యక్తులిద్దరు. వారు- డా॥ రామమనోహర లోహియా, డా॥ బి. ఆర్. అంబేద్కర్- వారికి నా విప్లవాభినందనలు.

— రచయిత

L.

9

కులవ్యవస్థ

విచ్చేనమెట్లు సమాజం

భారతీయ జీవనంలో కులమనేది ఒక అత్యంత ముఖ్యమైన అంతర్భాగం- సిద్ధాంత పరంగా కులవ్యవస్థను తిరస్కరించేవాళ్ళు, దానిని నిర్మూలించాలనుకునేవారు గూడా ఆచరణలో మాత్రం దానిని త్రోసి రాజనలేకపోతున్నారు. పుట్టుకలో, వివాహంలో, విందులో, చావులో - కులవ్యవస్థయొక్క పరిమితులను అతిక్రమించలేక పోతున్నారు. (అతిక్రమించే ప్రయత్నం గూడా పెద్ద ఎత్తున జరుగడంలేదు). మనిషి పుట్టుకలోనే ఏదో ఒక కులంలో సభ్యుడుగా పుడుతున్నాడు; ఇక ఆ చట్రాన్ని అతిక్రమించలేక పోతున్నాడు.

పుట్టుకతోనే మనిషి ఒక చలన రహితమైన వర్గంలో భాగస్వామి కావడం వల్ల చాలామంది చాలకాలంగా తమ

అందోళన, వైముఖ్యం ప్రకటిస్తూనే వచ్చారు. ఒక దానితో మరొకటి ఏమీ సంబంధంలేని అసమాన విభాగాలుగా సమాజాన్ని చీల్చివేసిన ఈ కులవ్యవస్థను రద్దుపరచాలని తరతరాలుగా సంస్కర్తలు ప్రయత్నాలు చేస్తూనే వచ్చారు. జన్మతః మనిషి ఒక చలన రహితమైన సాంఘిక అంతస్తుకు చెందినవాడు కావడమనే పద్ధతిమీద ఎన్నో తిరుగుబాట్లు జరిగాయి. హిందూ సమాజాన్ని ఒక నిచ్చెన మెట్ల సమాజంగా తయారుచేసిన కులవ్యవస్థను వేల సంవత్సరాలుగా ఎంతోమంది ప్రతిఘటిస్తూనే వచ్చారు.

ఉపనిషత్తుల రచయితలు కులవ్యవస్థలోకి ఆగాటి చాందస రూపాన్ని వ్యతిరేకించారు. చార్వాకుడు, అతని భావధోరణికి చెందిన భౌతిక వాదులు క్రీ॥ పూ॥ 600 ప్రాంతంలో కులవ్యవస్థ మీద పెద్దపెట్టున దాడిచేసినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. ఆ పిదప దాదాపు రెండువందల ఏండ్లకు గౌతమ బుద్ధుడూ, మహావీరజైనుడూ చాందస వాదంమీద ధ్వజమెత్తారు. ఆళ్వారుల మొదలు రామానందుని వరకూ ఎందరో తమ భక్తివాదాన్ని ప్రచారంచేస్తూ హిందూ సమాజాన్ని కులవ్యవస్థనుండి రక్షించే ప్రయత్నం చేశారు. బ్రహ్మ సమాజమూ, ఆర్య సమాజమూ యింకా అనేక సంస్కరణోద్యమాలూ గూడా కులవ్యవస్థను తిరస్కరించాయి. వివేకానందుడు కులవ్యవస్థను తీవ్రంగా ఖండిస్తూ ప్రచారం చేశాడు. గాంధీజీ కులంపేరిటి విచక్షణ చూపడాన్ని, అంటరాని తనాన్ని వ్యతిరేకిస్తూ వుద్యమాలు నడి

పాడు. సామాజిక అసమానతలకు వ్యతిరేకముగా బ్రాహ్మణేతరులు - ప్రధానంగా దక్షిణ భారత దేశంలో తిరుగుబాట్లు చేశారు. ఈ ఉదారవాద ధోరణులూ, సంస్కరణోద్యమాలూ, ప్రతిఘటనలూ, ప్రచారాలూ, తిరుగుబాటులూ కులవ్యవస్థను ఆయా కాలాలలో కొంత మెత్తబరచడం జరిగింది. కాని కులవ్యవస్థ ఎప్పటికప్పుడు తన శక్తిని పుంజుకుంటూ మరల మరల గట్టిపడుతూనే వచ్చింది. ఇది గత ఏ వేల సంవత్సరాల చరిత్ర.

ఇన్ని శతాబ్దులను తట్టుకుని ఇంత బలంగా నిలచివుండడానికి తగినశక్తి కులవ్యవస్థకు ఎక్కడినుండి వచ్చింది? దానివలన సమాజానికి చేకూరుతున్న లాభనష్టాలా లెలాంటివి? ఇవన్నీ సమాజ పరిణామ చరిత్రపట్ల ఏమాత్రం ఆసక్తివున్న వ్యక్తి యైనా ఎదుర్కొనే ప్రశ్నలు. వీటిని అర్థం చేసుకోవడానికి ముందు కులవ్యవస్థ ఎలా ఏర్పడినదో, దాని విశిష్ట లక్షణాలేమిటో పరిశీలించడం చాలా ముఖ్యం.

కులాలు ఎలా ఏర్పడ్డాయి?

జన్మ రీత్యా ఒక కులంలో సభ్యుడు కావడమనే విధానాన్ని బలపరచే ఒక కథ కులవ్యవస్థ యొక్క ఏర్పాటును గురించి ప్రచారంలో వున్నది. బ్రహ్మదేవుని ముఖంనుండి బ్రాహ్మణులూ, భుజములనుండి క్షత్రియులూ, పొట్టనుండి వైశ్యులూ, పాదములనుండి శూద్రులూ పుట్టు

కొచ్చారని ఈ కథ చెబుతుంది. ఇది కేవలం పుక్కిటి పురాణమని వేరుగా చెప్పనవసరంలేదు. తర్కానికి గానీ, హేతువాదానికి గానీ ఏమాత్రమూ నిలువ వీలులేని అంధ విశ్వాసం తప్ప ఈ కథకు వేరే ఆధారం లేదు.

వేదముల కాలంలో కులవ్యవస్థ వున్నట్లు ఆధారాలు లేవు. ఆ పిదప న్యాయశాస్త్రమును రచించిన గౌతముడు "ఆర్య మ్లేచ్ఛవర్ణిక:" అని చెప్పినాడు. అనగా ఆర్యులలో మూడు వర్ణముల వారేకదా వుండవలసినది? బ్రాహ్మణులు శ్వేతాంగులనీ (తెల్లనివారు), క్షత్రియులు రక్తాంగులనీ (ఎర్రనివారు), వైశ్యులు పీతాంగులనీ (పసుపురంగు వారు) సాంప్రదాయకంగా చెప్పబడుతున్నది. మరి కాలాంగులని (నల్లనివారు) వర్ణించబడుచుండిన శూద్రులెవరు? ఆర్యులు కారా? భగవద్గీతలో నాల్గుకులాల ప్రస క్తి కనుపిస్తుంది. మనుస్మృతి నాలుగు వర్ణాలను మాత్రమే అంగీకరిస్తుంది. కాని, అందులో 'పంచములు' ప్రస క్తి గూడా వున్నది. మరి ఈనాడు చూస్తే ఐదు కులాలేనా వున్నాయి? వేల సంఖ్యలో కులాలు దేశమంతటా కనిపిస్తున్నాయి. ఇన్ని కులాలు ఎలా ఏర్పడ్డాయి? వాటి సంగతేమిటి? దీనికి హిందూ పురాణాలు ఏ రకంగానూ సమాధానం చెప్పలేకపోతున్నాయి.

కాని, కులవ్యవస్థ వుత్పత్తిని వ్యాఖ్యానించడానికి గణనీయమైన ప్రయత్నాలు కొన్ని జరిగాయి. జాతుల

పరంగా దీనిని వ్యాఖ్యానించేవారి వాదన యిలా వుంటుంది:

ఆర్యులు భారతదేశములోనికి వెలుపలినుండి తరలి వచ్చినవారు. ఇక్కడి ఆదిమ జాతులను - అనగా ద్రావిడులు వర్ణాలను - జయించారు ఆ విజయ పరంపర యొక్క ఫలితంగానే కులవ్యవస్థ ఏర్పడింది. గెల్చిన వారు అగ్రకులంగా, పరాజితులేమో దళిత కులాలుగా ఏర్పడిపోయారు.

ఈ వాదాన్ని బలపరుస్తూ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు తమ 'సూతపురాణ' కావ్య పీఠికలో యిలా వ్రాశారు.

"ఆర్యులు శ్వేతాంగులు, ద్రావిడులు కాలాంగులు. వీరిరువురి రక్త సాంకర్యముచే కలిగిన ప్రసవముయొక్క దేహ చ్ఛాయ రక రకంబులుగా నుండును.... ఈ కారణము చేతనే ఆర్యుల యందు వర్ణవిభాగ మేర్పడవలసి వచ్చెను." అందువలన బ్రాహ్మణులు మాత్రము తెల్లనివారుగా వుండి క్షత్రియ, వైశ్యకులములవారు ఎరుపు, పసుపు రంగుల వారైనారని వీరి వాదము. వీరి వ్యాఖ్యానం ప్రకారం శూద్రులు ఆర్యేతరులు. "ఆర్యుల విజయపరంపరలకు తట్టుకోలేక పూర్తిగా అణచివేయబడి అన్ని హక్కులనూ కోల్పోయిన నాగజాతివారే యీనాటి అస్పృశ్యజాతులు" (పంచములు) అని డా॥ బి. ఆర్. అంబేద్కర్ అభిప్రాయం.

మరికొందరు ఈ కులవ్యవస్థను వృత్తిపరంగా ఏర్పడినదని భావిస్తున్నారు. గ్రామీణ, వ్యవసాయక ఆర్థిక వ్యవస్థలోని ప్రాథమిక దశలలో ఒకవ్యక్తి చేసే వృత్తిని బట్టి ఆ వ్యక్తిని బ్రాహ్మణుడనో, మరొకడనో పిలుస్తూ వచ్చారనీ - క్రమక్రమంగా ఆ వృత్తినే అతని సంతతి కూడా చేపట్టడం జరిగి, ఆ పిదప అతని సంతతి వారు ఆ వృత్తిని దప్ప మరో వృత్తిని చేపట్టని స్థితి వచ్చినదనీ, అలా కులాలు రూఢి అయ్యాయనీ వీరు చెబుతున్నారు. ఆ విధంగా వృత్తి వర్గాలే క్రమంగా కులాలుగా ఘనీభవించి, కుల విభజన చాలా ఖచ్చితమైన రూపాన్ని తీసుకురావడానికి కొంతకాలం పట్టినదనీ వీరు వ్యాఖ్యానిస్తున్నారు. వీరి వాదన ప్రకారం సమాజంయొక్క అవసరాలు పెరుగుతూ క్రొత్త వృత్తులు ఏర్పడుతూ వచ్చిన కొలదీ కులాల సంఖ్య కూడా పెరుగుతూ వచ్చినట్లు అర్థమవుతుంది. అలా కులాల సంఖ్య ఒకటి మూడై, నాలుగై, అయిదై, వందలలోనికి వేలలోనికి పెరిగివుండాలి.

కొంత తరచి చూచినప్పుడు పైన చెప్పబడిన రెండు వాదనలలోనూ (జాతిపరం, వృత్తిపరం) కూడా సత్యాంశ గోచరమవుతున్నది. రెండు కారణాలలో ఏదో ఒక్కటి గాక, రెండూ కలిసే కులవ్యవస్థ యొక్క ప్రస్తుత రూపానికీ స్వభావానికీ కారణభూతాలై వుంటాయి. ప్రపంచ చరిత్రలోని వివిధ దశలలో కులవ్యవస్థను పోలిన వ్యవస్థలు ఏర్పడుతూ వుండడం, వానికి వ్యతిరేకంగా పోరాటాలు సాగుతూ

వుండడం మనకు కనుపిస్తుంది. వాటినిగూడా పరిశీలించి నట్లయితే మనదేశంలో కులవ్యవస్థ ఎలా ఏర్పడినదీ, దాని మూల స్వభావం ఏమిటో అవగాహన చేసుకోడానికి వుపకరిస్తుంది. ఉదా॥ ప్రాచీనకాలపు రోమ్ నగరంలో పాట్రీషియన్, ప్లేబియన్ వర్గాలు ఏ విధంగా ప్రవర్తించాయో పరిశీలించండి!

రోమ్ నగరంలో కులాల కథ

ప్రాచీన రోమన్ సమాజం చూడండి. 'పాట్రీషియన్లు' పాలకవర్గం, సామంతవర్గం. వారు తామే రోమ్ నగరపు సిసలైన పౌరులమనీ, కట్టీలేని రోమనులమనీ భావించేవారు. 'ప్లేబియన్లు' రోమ్ నగరంలో వుండే స్వతంత్ర పౌరులే అయివుండి గూడా సిసలైన రోమనులుగా పరిగణించబడేవారుకాదు. వీరు వెలుపలి ప్రాంతాలనుండి వచ్చి వృత్తులు చేసుకుంటూ వుండిపోయిన వారని పాట్రీషియన్లు చెబుతుండేవారు. ప్లేబియన్లకు ప్రభుత్వంలో భాగస్వామ్యం లేదు. 'క్లయింట్స్' అనే వర్గంవారు పాట్రీషియనుల జెన్నుకు - అనగా గణము, లేదా గోత్రముకు- చెందినవారే గాని పాట్రీషియను కుటుంబాలలోమాత్రం సభ్యులు కారు. కొంతవరకు రక్త సంబంధీకులే. వెలివేయబడిన వారనుకోవచ్చును. వీరు రెండవశ్రేణి వర్గం. వీరికి రాజకీయాధికారాలు లేవు: కాని సైనిక బాధ్యత లుండేవి. కాలక్రమంగా వీరు మూడవ శ్రేణివారైన ప్లేబియనులలో కలసిపోయారు.

నాల్గవ తరగతివారు బానిసలు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేక, కేవలం వూదిగం చేసుకు బ్రతికే సేవకులు వీరు. వస్తువుల మాదిరి, యితర ఆస్తుల మాదిరి ఈ బానిసలను అమ్మడం, కొనడం గూడా జరిగేది.

ఈ వివిధ వర్గాల మధ్య సాగిన సంఘర్షణలే రోమ్ నగర అంతరంగిక చరిత్రలో రాజకీయ యుగాన్ని, రిపబ్లిక్ యుగాన్ని గూడా బాగా ప్రభావితం చేశాయి. ప్రారంభంలో ఈ వివిధ వర్గాలమధ్య అంతర్వివాహాలు లేవు. మన కుల వ్యవస్థ లక్షణాలన్నీ అక్కడా వుండేవి. నిరంతర పోరాటాల ద్వారా బడుగు వర్గాలు కొన్ని కొన్ని హక్కులను సంపాదించుకోవడం జరిగింది ఒక దశలో కమిటియా సెంచూరియాటా (ప్లేబియనుల ప్రతినిధి సభ) నుండి ఎన్నికైన ఒక ప్లేబియను ప్రతినిధికి రోమన్ రిపబ్లిక్ కార్యనిర్వాహక సమితిలో సభ్యత్వం యివ్వడానికి అంగీకరించబడింది. కాని, ఒక్క షరతు – ఆ ప్రతినిధి ప్లేబియనులచేత ఎన్నుకోబడిన పిదప డెల్ఫీ అనే దేవత ఆమోదాన్ని గూడా అతడు పొందాలి. దేవత పేరైన దేవతయొక్క వాక్కును తెలుప వలసినది పూజారి. ఆ పూజార్లు పాట్రీషియను వర్గంలోని వారేగదా! వారొక నాటకం ఆడేవారు. సమర్థుడైన ప్లేబియన్ ప్రతినిధి పేరును దేవత పేరైన ఆ పూజారి తిరస్కరిస్తూ వుండేవాడు పనికిమాలిన వాని పేరునే డెల్ఫీ దేవత ఆమోదించేదట. ఆ విధంగా మూఢ మత విశ్వాసాల మూలంగా ప్లేబియనులు తాము సాధించుకున్న విజయాలను

గూడా నిలుపుకోలేకపోతూ వుండేవారు. క్రమంగా క్రైస్తవ మతం రోమను సామ్రాజ్య మంతటా అల్లుకొనిపోయినా, గానీ బానిస వ్యవస్థతో సహా మొత్తం కులవ్యవస్థ మాయం కాలేదు.

గ్రీసులో గూడా యిలాంటి కులవ్యవస్థను సమర్థించడానికి ప్లేటో ప్రయత్నించాడు. ఆయన సిద్ధాంతం స్థూలంగా యిది:

మానవులలో ప్రకృతి సిద్ధంగానే మూడు తరగతుల వారుంటారు. (1) తిండిధ్యాస గలవారు (2) పరాక్రమ ప్రదర్శనపై ఆసక్తి గలవారు (3) జ్ఞాన సముపార్జనా సక్తి గలవారు. వారి కాయా లక్షణాలు జన్మతః వస్తాయి

ఈ సిద్ధాంతానికి ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు: విలువ నివ్వరు. మానవులు మొత్తాన్ని యీ మూడు తరగతులుగా పరిమితంచేసి విభజించడం హేతు విరుద్ధమని తేలింది.

ఆధునిక, సమకాలీన చరిత్రలో కానవచ్చే ధోరణులను గూడా పరిశీలిద్దాం. ఆధునిక నాగరికతకు శిఖరాగ్రమని పించుకుంటున్న అమెరికాలో కులవ్యవస్థ జాతిపరంగా కనుపిస్తుందీనాటికీ. ఐరోపానుండి వెళ్ళి అమెరికన్ భూముల

సాక్రమించుకున్న తెల్లజాతులు అక్కడి రంగుజాతుల వారిని (రెడ్ ఇండియనులను) పూర్తిగా అణచివేశారు. ఆ రంగు జాతులు కేవలం నామా వశిష్టంగా మిగిలిపోయారు. బానిసలుగా పట్టుకొని రాబడిన నల్లవారిని (నీగ్రోలను) యీనాటికీ వెలిగా చూచే పద్ధతి సాగుతోంది. హోటళ్ళలో గూడా "తెల్లవారికి మాత్రమే" అనే బోర్డులు కనుపిస్తాయి.

సోవియట్ రష్యాలో గూడా యీనాడు శరీర శ్రమ చేయడానికి మేధావి తరగతులవారు విముఖత చూపుతున్నారని కృశ్చేవ్ చెప్పారు. ఇది దేనిని సూచిస్తున్నది? మేధావి వర్గాలవారు మిగతా వర్గాలవారి శారీరక శ్రమను తాము దోచుకుంటూ వుండాలనే స్వార్థదృష్టినే నాడూనేడూ గూడా ప్రదర్శిస్తున్నట్లు కనుపిస్తున్నది ఆ విధంగా ఈ మేధావి వర్గాల పాపపుటాలోచనల, కుతంత్రాల ఫలితంగానే వృత్తి వర్గాలు, సామాజిక సమూహాలూ క్రమంగా ఘనీభవించి కులాలుగా రూపొందుతున్నాయని పిస్తుంది.

మేధావుల దుష్ట పాత్ర

డా।। రామమనోహర లోహియా యిలా వ్రాశారు:

"శారీరక శ్రమ హీనమైనదనీ, బుద్ధి శ్రమయే ప్రసన్నత మైనదనీ కలిగిన భావన ఆధారంగా బేధభావం

ఏర్పడి, ఆ బేధభావం శాశ్వత రూపాన్ని ఏర్పరచుకునే ప్రయత్నమే కులాలు ఏర్పడేందుకు మూల కారణం."

కులవ్యవస్థ దైవనిర్మితమూ కాదు, ఒక్కరోజులో ఏర్పడినదీకాదు. అన్ని సామాజి కాంశాలకు వలెనే దీనికి గూడా ఒక పరిణామక్రమం వున్నది. కులవ్యవస్థ అనే యీ వుచ్చును భారతీయ సమాజం మెడకు తగిలించిన వారు ఒక్క రోజులో దీనిని బిగించలేదు. వారి ప్రయత్నాలకు ప్రతిఘటన వచ్చినపుడల్లా వారి వ్యూహాలు గూడా మారుతూ వచ్చాయి. ప్రతిఘటన బలహీనంగా వుంటే నిర్దాక్షిణ్యంగా అణచివేశారు; బలంగావుంటే లొంగుబాటు ప్రదర్శించారు; అవకాశం చూచి దొంగ దెబ్బలు తీశారు. చివరకు తాము యిరుక్కున్న యీ వుచ్చు చాలా సబబైనదనీ, న్యాయమైనదనీ వుచ్చులో చిక్కుకున్నవారు గూడా భావించేలాగా చేయగలిగినది, భారతీయ మేధావి వర్గం. అందుకు పునర్జన్మ వాదం, కర్మసిద్ధాంతం-అన్నీ తీసుకురాబడ్డాయి; భగవంతుడిని చూశామన్నారు, కొందరు ఇదంతా వేల సంవత్సరాల చరిత్ర.

మనిషి శారీరకక్లేశమను తగ్గించుకోవడానికి ప్రయత్నించడం సహజమే. కాని, విశ్రాంతి అనే దానిని యావత్తు సమాజానికీ లభ్యమయే సౌకర్యంగా కాక, తనకూ తన వంశీకులకూ మాత్రం ఆ సౌకర్యం లభిస్తే చాలుననే సంకుచిత భావంతో కొందరు తెలివిగలవారు పన్నిన వల యీ కులవ్యవస్థ.

ఈ సౌకర్యాలను తమ స్వంతం చేసుకుంటూ పెళ్ళ డానికిగాను యిదరులమీద శ్రమభారాన్ని ఎక్కువచేయడం, వారిని హీనంగా చూడడం జరుగుతూ వచ్చింది. వారిమీద ఈ భారాన్ని వుంచుతూ, వుత్పత్తి సాధనాలపై యాజ మాన్యం తమ చేతులలో వుంచుకునే నిమిత్తం వారిని పూర్తి అజ్ఞానంలో వుంచడం అవసరమైంది. దీనిని గుర్తిం చిన వారు కొందరు యీ దోపిడికీ, అజ్ఞానానికీ వ్యతిరేకంగా పోరాడుతూనే వచ్చారు.

విభిన్న జాతులమధ్య సంఘర్షణ ప్రతి దేశ చరిత్ర లోనూ చూస్తున్నాం. గెలుపొందినవారు మిగిలినవారిని అణచివేయడం, వారిని వివిధ వృత్తులలో వుంచి, వారిని శరీరశ్రమ చేయడానికే వుపయోగిస్తూ తాము మాత్రం సుఖమయ జీవితాన్ని తమ స్వంతం చేసుకోడానికి ప్రయ త్నించడం అన్ని దేశాలలోనూ జరుగుతూనే వున్నది. ఈ వర్గీకరణను శాశ్వతంచేసి, సుఖజీవితాన్ని, దోపిడీచేసే అవ కాశాన్ని వంశ పారంపర్యంగా తమ స్వంతం చేసుకోడానికి జరిగే ప్రయత్నం కులవ్యవస్థను సృష్టిస్తుంది. జాతి స్వచ్ఛ తను కాపాడుకోవడం పేరిట జాత్యాంతర వివాహాలను నిషే ధించడం, జాతి సంకరం వలన పుట్టినవారు నూతన జాతు లుగా రూపొందడం, అలా కాలక్రమేణా జాతుల స్వరూ పాలు మారుతూ వుండడం జరుగుతూ వచ్చింది. ఈ నిఘంగా విజేతలైన కొన్ని జాతులు, వాటి మేధావి వర్గాలూ మిగి లిన వారిని అణచివేసి, వారిచేత తరతరాలుగా వూడిగం చేయించుకోవడానికి చేసిన ఏర్పాటే, కులవ్యవస్థ.

ఈనాడు మనదేశ ప్రజలను ఆర్యులు, ద్రావిడులూ అని నిర్వచించబూనడం సరియైనదికాదు. ఆర్యులనబడేవారు అన్యప్రాంతాలనుండి భారతదేశంలోనికి వచ్చినవారని చెప్పబడుతోంది. తిలక్ మహాశయుడు దీనినే నిర్ధారించాడు. ద్రావిడులు, కలులు, నాగులు - యింకా అనేక యితర జాతులు అంతకు పూర్వమే యిక్కడ వున్నట్లు చెబుతున్నారు. కాని, వారంతా అసలు ఎక్కడివారు? ఎలా, ఎప్పుడెప్పుడు ఈ దేశంలోనికి ప్రవేశించినారో మాత్రం యింకా పరిశోధకులు నిర్ధారించలేక పోతున్నారు. ఆర్యుల పిదప గూడా గ్రీకులు, పారశీకులు, హూణులు అరబ్బులూ, మంగోలియనులూ - మరెన్నో యితర జాతులవారూ వచ్చి యిక్కడ చేరారు. వేరాది సంవత్సరాల పరిణామక్రమంలో ఈ విభిన్న జాతులమధ్య సంకరం చాలా విపరీతంగా జరిగిపోయింది. ఈ మిశ్రమం ఫలితమే యీనాటి భారత జాతి. ఎవరిని గానీ మూపించి యితడు ఆర్యుడనో, మరొకడనో చెప్పడం సాధ్యపడే విషయం కాదు. ఏ జాతీ స్వచ్ఛంగా మిగలలేదు అడవులనుండి వెలికిరాకుండా నిలచిపోయిన జాతులుకూడా ఏమీసంకరం కాకుండా మిగలలేదు. అయితే, మిగతావారిలో కంటె వీరిలో సంకరం కొంత తక్కువని మాత్రం అంగీకరించవచ్చును.

జాతిపరంగా జరిగిన సంఘర్షణలూ, వృత్తి పరంగా జరిగిన వర్గీకరణా - ఈ రెండు కారణాలకు తోడు ప్రధానంగా మేధావి వర్గాల దుష్టపాత్ర - యివన్నీ కలసి వేల

సంవత్సరాల చరిత్రలో కులవ్యవస్థను భారతీయ జీవనంలో లోతుగా వ్రేళ్ళు తన్నేలాగా బలపరచాయి.

ఉపనిషత్తులు – మనుధర్మము

సమాజంలోని వివిధవర్గాల ప్రజలు ఒక వర్గంలో నుండి వేరొక వర్గములోనికి మారడానికి అవకాశాలు మూసి వేయబడిన నాడు వర్గాలు కులాలుగా మారతాయి. అలాగే, ఒక కులంలోని వ్యక్తి మరొక కులంలోనికి మారడానికి అవ కాశం యివ్వబడిన నాడు కులాలు వర్గాలుగా పరిణామం చెందుతాయి. కులాలు వర్గాలుగానూ, వర్గాలు కులాలు గానూ మారడానికి జరిగే ప్రయత్నాలు మానవ చరిత్ర నిండా మనకుకనుపిస్తాయి. హిందూమతంలో ఛాందసభోరణు లకూ, ఉదారవాదానికీ మధ్య సంఘర్షణ అనాదిగా సాగు తూనే వున్నది. కులవ్యవస్థ మూలంగా తమ హక్కులు కోల్పోతున్న వర్గాలు తమ హక్కులను కాపాడుకోవడం కోసం తిరుగుబాట్లు చేస్తూనే వచ్చాయి. ఆ దశలలో ఆ తిరుగుబాటు వర్గాలను సంతృప్తి పరచే వుద్దేశ్యంతో ఉదారవాదులూ, సంస్కరణ వాదులూ ఛాందస భోరణు లతో తగాయిదా పడుతూనే వచ్చారు. మనకు అందుబా టులో వున్న సమాచారం మేరకు మొదటి సంఘర్షణ ఉపని షత్తుల ద్వారా సాగిందని అర్థమవుతున్నది.

సమాజంలో విజ్ఞానాన్ని తమకు మాత్రమే గుత్తకు తీసుకోవాలని ప్రయత్నించిన పూజారి వర్గంమీద క్షత్రియులు మొదటగా తిరుగుబాటు చేశారు. కులం, జన్మరీత్యా గాక అర్హతలరీత్యా వస్తుందని క్షత్రియవర్గం సిద్ధాంతీకరించింది. వీరి వాదాన్ని బలపరచేవే ఉపనిషత్తులు. క్షత్రియులు రాజ్యాధికారమూ, సైనిక బలమూ వున్నవారగుట చేత వారి తిరుగుబాటు బలంగానే సాగింది. పరశురామ, విశ్వామిత్రుల కథలు ఆ కాలానికి సంబంధించినవేనని వూహించడానికి ఆధారాలున్నాయి.

క్షత్రియులు అహంకారంతో బ్రాహ్మణులను అవమానిస్తున్నారనే కారణంగా భూమిపైగల క్షత్రియులందరినీ హతమార్చడానికే ప్రతిజ్ఞ చేశాడు పరశురాముడు. పరశురాముని తండ్రి జమదగ్ని. జమదగ్ని తండ్రి బ్రాహ్మణుడు. తల్లి క్షత్రియకాంత. అయినా జమదగ్ని బ్రాహ్మణుడే అయినాడు. పరశురాముడు స్వభావముచే క్షత్రియుడైనా, ఆయుధపాణియైనా, బ్రాహ్మణ వర్గానికే నాయకుడుగా నిలిచినాడు. ఇక విశ్వామిత్రుని సంగతి చూడండి! అతడు పుట్టుకచే క్షత్రియుడు. కాని వేదవేత్తయై బ్రాహ్మణత్వాన్ని సంపాదించడానికి ఘోర తపసు చేసి, ఎన్నో పరీక్షలను తట్టుకోవాల్సి వచ్చింది. పరశురాముని దిగ్విజయ యాత్రలో అతనికి దాసోహమనిన వారిలో ఒకడు దశరథ మహారాజు. అతని కుమారుడు శ్రీరాముడు. మిథిలాధిపతి జనక మహారాజు బ్రాహ్మణుల ఆధిక్యతను సవాలుచేసి వుద్యమానికి

ఒక ముఖ్య నాయకుడు. విశ్వామిత్రుని ప్రోద్బలంతో జనక రాజ పుత్రియైన సీతను శ్రీరాముడు వివాహ మాడాడు. ఇది బ్రాహ్మణ వర్గానికి చాలా యిబ్బంది కలిగించింది సీతా స్వయంవరంలో శివధనస్సు విరిచాడనే నెపంతో పరశు రాముడు శ్రీరామునిపై తలపడ్డాడు. పరశురాముని ఓటమి, ఆ పిదప రాజీలతో కథ ముగుస్తుంది.

ఈ కథ నిజంగా జరిగిందా, లేదా అనేది మనకంత ముఖ్యంకాదు. కథలో సూచితమైన ఆ కాలంనాటి సామాజిక పరిస్థితులేమిటన్నదే ప్రధానం. ఈ కథ నిస్సందేహంగా ఉపనిషత్తుల కాలంనాటిదే. బ్రాహ్మణ, క్షత్రియ వర్గముల మధ్య చివరకు రాజీ కుదిరి ఉపనిషత్తులు ప్రామాణికాలుగా అంగీకరించబడ్డాయి.

అలా ఎప్పటికప్పుడు ఉదార వాదానికి తాత్కాలికంగా లొంగినట్లు కనుపించినా ఛాందసవాదం తిరిగి క్రమంగా, ఏదో ఒక రూపంలో తలెత్తి కులవ్యవస్థను మింత రూఢంగా తయారుచేసిన సంగతిని సూచించే కొన్ని కథలు గూడా మనకు ప్రాచీన ఇతిహాసాలలో లభిస్తాయి.

ఛాందోగ్యోపనిషత్తులో చెప్పబడిన జాబాలి కథ చూడండి. ఒకనాడు ఒక కుర్రవాడు గౌతమ మహర్షి వద్దకు వెళ్ళి శిష్యునిగా స్వీకరించమని ప్రార్థించాడు. మహర్షి : "బిడ్డా, నీ గోత్రమేమిటి ఏ వంశంలో జన్మించినావు?" అని

ప్రశ్నించాను. ఆ కుర్రవాడు యిలా అన్నాడు: "స్వామీ! నేను యింటివద్దనుండి బయలుదేరునపుడు మా అమ్మను ఈ విషయం అడిగాను. ఆమె యిలా చెప్పింది - 'నాకు తెలియదు. నా యవ్వనంలో దాసిగా అనేకచోట్ల పని చేశాను. అనేక మందితో శయనించాను. నిన్ను కన్నాను. నీ తండ్రి ఎవరో నాకు తెలియదు. ఒకటిమాత్రం సత్యం. నా పేరు జాబాలి. నీ పేరు సత్యకాముడు. నీవు సత్యకామ జాబాలివని చెప్పు' - ఇదీ నా తల్లి చెప్పిన మాట" అని చెప్పాడ బాలుడు. ఉన్న నిజాన్ని నిర్భయంగా, గుంజాటన లేకుండా చెప్పగలిగిన ఆ కుర్రవాడిని వెంటనే బ్రాహ్మణుడుగా నిర్ణయించి, స్వీకరించినాడు, మహర్షి. ఆ సమయంలో గౌతముడిలా అన్నాడు. "సత్యపథంనుండి తొలగిపోని వారంతా బ్రహ్మానుభవానికి అర్హులే." ఇది ఉపని షత్తులలోని కథ. కనుక యిది మూడువేల ఏండ్లు నాటిదై వుండవచ్చును.

ఆ పిదప కొద్దికాలము నాటికే పరిస్థితి మారింది. క్షత్రియుడైన విశ్వామిత్రుడు బ్రహ్మర్షిగా పరిగణించబడేం దుకు అన్ని అర్హతలు వుండికూడా ఘోర తపస్సుచేసి, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనగాని బ్రహ్మత్వాన్ని పొంద లేకపోయాడు. ఈ విశ్వామిత్రుడే సాధారణ ప్రజల వాడకం కోసం గాయత్రీ మంత్రాన్ని రచించినాడు. ఈ కథ ఛాందస

వాదం తిరిగి తలయెత్తడానికి సాగిస్తున్న ప్రయత్నాన్ని సూచిస్తుంది.

మనువ్యకాలం నాటికి ఛాందసవాదం తిరిగి సంపూర్ణ విజయాన్ని సాధించింది. ఈ దశకు సంబంధించిన మరొక కథ వున్నది. "ఒక మునిబాలుడు చిన్నతనంలోనే సర్వ భాషలూ, సర్వ శాస్త్రాలూ, అభ్యసించాడు. తనతల్లి ఒక హీనజాతి పురుషునితో వ్యభిచరించిన ఫలితంగా తాను పుట్టినట్లు జంతువుల సంభాషణ వలన గ్రహించి, తల్లిని ప్రశ్నించాడు. ఆమె అది నిజమేనని చెప్పింది. ఆ సత్యాన్ని మహర్షికి చెప్పాడా బాలుడు. అందువలన అతడు నీచ బీజోత్పన్నుడని బ్రాహ్మణకులంనుండి వెలివేశారు. నిజాన్ని నిర్భయంగా చెప్పినందుకు సత్యకాముడు బ్రాహ్మణుడైన నాటికి, సత్యము చెప్పినందుకే ఈ మునికుమారుడు వెలివేయబడిన నాటికి పరిస్థితి ఎంతగా మారిందో వేరే చెప్పనవసరంలేదు: ఈ బాలుని కథ అంతటితో అంతంకాలేదు. తిరిగి బ్రాహ్మణత్వాన్ని సాధించడానికి తపస్సు ప్రారంభించాడు. నూరేళ్ళు గడిచాయి. ఇంద్రుడు ప్రత్యక్షమైనాడు. కాని మునిబాలుని కోరిక తీర్చడం అసాధ్యమని చెప్పి తిరిగి వెళ్ళిపోయాడు. మరొక నూరేండ్లు తపస్సు సాగింది. మరల ఇంద్రుడు అదే సమాధానం ఇచ్చాడు. మరొక నూరేండ్లు. చివరకు ఇంద్రుడు రాజీకొచ్చాడు. "నీకు యజ్ఞ యాగాదులలో దేవతలతో సమానమైన స్థానం కల్పిస్తాను. అంతేకాని బ్రాహ్మణత్వం మాత్రం వీలుకాదు," అని చెప్పాడు ఇంద్రుడు. భూదేవుడు

(బ్రాహ్మణుడు) కావడంకంటే దేవుడు కావడమే సులభమన్నమాట.

ఈ కథలన్నీ కులవ్యవస్థ ఎలా క్రమంగా ఘనీభవిస్తూ వచ్చినది తెలియజేస్తాయి. మనుధర్మశాస్త్రం కులవ్యవస్థను చాలా కట్టుదిట్టంగా బలపరిచింది. కులమనేది గుణాన్నిబట్టి కాక జన్మనుబట్టి నిర్ణయమైపోయింది.

మనువుయొక్క భావధోరణి క్లుప్తంగా చెప్పాలంటే ఇలా వుంటుంది:

నిర్గుణబ్రహ్మం సగుణంగా మారాక అందునుండి ఈశ్వరుడు, మూలప్రకృతి ఆవిర్భవించాయి. ఆ మూల ప్రకృతిలో చైతన్యం ప్రవేశించడంతో ప్రకృతి పరిణామశీల మౌతుంది. ఆ పరిణామక్రమంలోనే క్రిమికీటకములు, సర్పజాతులూ, జంతు జాలమూ – ఇలా మానవుని వరకూ పరిణామం జరుగుతుంది. మానవజన్మలో మొదటిమెట్టు (అనగా జంతుజన్మకు పై మెట్టు) శూద్రజన్మ. అన్నిటికంటె పై మెట్టు బ్రాహ్మణజన్మ. ప్రకృతిలోని అన్ని జీవరాసుల లోని ఆత్మ ఒక్కటే. అది బ్రహ్మతత్వంలోని అంశయే. ఈ అంశ తనయొక్క మూల తత్వాన్ని (అనగా బ్రహ్మ తత్వాన్ని) తిరిగి చేరుకోవడానికి చేసే ప్రయత్నంలో ఎన్నో జన్మలెత్తుతుంది. ఒకొక్క మెట్టూ ఎక్కుతూ, చివరకు గమ్యాన్ని చేరుతుంది.

ఈ భావ ధోరణి నుండే మనుధర్మ శాస్త్రం వచ్చింది.

మనుధర్మం ప్రకారం కులవ్యవస్థ సమాజాన్ని నాలుగు ప్రధాన భాగాలుగా చీల్చివేసింది. జన్మరీత్యానే కులం సిరపడింది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాల వారు ద్విజులు. శూద్రులు అద్విజులు. శూద్రులుపై మూడు కులాలవారి లాగా విద్యావ్యాసాంగం చేయడానికి వీలులేదు. అగ్రకులాల వారిని సేవిస్తూ వుండటమే వారి కర్తవ్యం. ఈ కులధర్మాలను తప్పడానికి వీలులేదు. సేవా వృత్తిలో వుండేకులం (శూద్రులు) అస్తిగాని, ఆయుశ్చంగాని, జ్ఞానంగాని కలిగి వుండేందుకు వీలులేదు. రెండు వేరు వేరు కులాలమధ్య వివాహం నిషిద్ధం. అందులోనూ ఒక విచిత్రం. బ్రాహ్మణుడు శూద్రస్త్రీని బలాత్కరించినచో అతడు ప్రాయశ్చిత్తం చేసుకుంటే చాలును. కాని, శూద్రుడు బ్రాహ్మణ స్త్రీ పట్ల కోరిక వ్యక్తంచేస్తే చాలును, అతనికి లింగచ్ఛేదనమే శిక్ష. ఇది మనువునుండి మనకు సంక్రమించిన "సదాచారము". ఇదే "హైందవ ధర్మ మార్గము". శూద్రుడు వేదమంత్రం చదివితే నాలుక కోసివేయాలనీ, వేదం వింటే చెవులో సీసంపోయాలనీ చెప్పే ఆచారము కుల వ్యవస్థ ద్వారా సంక్రమించాయి. శూద్రులేకాదు, అగ్ర కులాలలోని స్త్రీలుకూడా ఏ హక్కూలూ లేని బానిసలుగా మనువు కాలానికి మారిపోయారు. "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" (స్త్రీ స్వాతంత్ర్యమునకు అర్హురాలు కాదు) అని తేల్చివేసినది ధర్మశాస్త్రం.

మనువు ఎప్పటివాడో ఖచ్చితంగా నిర్ధారణచేసి చెప్పడం కష్టమే. పైన పేర్కొనబడిన కథల కాలాన్ని, ఉపనిషత్తుల కాలాన్ని కూడా ఖచ్చితంగా చెప్పజాలము. కాని ఇప్పటికిఉన్న ఆధారాలను బట్టి ఉపనిషత్తుల కాలాన్ని క్రీ. పూ. 800 ప్రాంతంగా నిర్ణయించడం జరుగుతుంది

చార్వాక, బౌద్ధ మతాలు

పురాతన భౌతికీయ భౌతికవాదాన్ని చార్వాక మతంగా పేర్కొనడం జరుగుతుంటుంది. చార్వాక మతస్థులు కులవ్యవస్థను నిర్మూలించడానికి చేసిన కృషి అపారము. కేవలం ఒక సంస్కరణోద్యమంగా కాక, ఒక గొప్ప తాత్విక తిరుగుబాటుగా చార్వాకమతం పరిఢిల్లినది. ఈ చార్వాకుడు ఎప్పటివాడో చెప్పడం కష్టం. కాని క్రీ. పూ॥ 600 ప్రాంతంవాడని సాధారణంగా పరిశోధకులు అభిప్రాయ పడ్తున్నారు.

చార్వాకుని రచనలు గానీ, అతని అనుచరుల రచనలు గాని మనకేమీ లభ్యంకాలేదు. కాని, చార్వాకుని గూర్చి, అతని మతం గురించి తీవ్రంగా విమర్శిస్తూ వ్రాయబడిన వ్రాతలనుండే చార్వాకుడు ఏమి చెప్పాడో తెలుసుకోవాల్సి వస్తుంది కౌటిల్యుని అర్థశాస్త్రం (క్రీ॥ పూ॥ 3:0) చార్వాకమతం గురించి పేర్కొన్నది. మాధవాచార్యుని "సర్వదర్శన సంగ్రహం"లో చార్వాకుల పరిస్థావన

వున్నది. మాధవాచార్యుడు చార్వాకమత మూల పురుషు నిగా బృహస్పతిని పేర్కొన్నాడు.

స్వర్గము, నరకము, ముక్తి, - యివన్నీ కేవలం కల్పి తాలని బృహస్పతి చెప్పినట్లుగా ఆ గ్రంథంలో పేర్కొన బడి వుంది. బృహస్పతి చెప్పినట్లుగా పేర్కొనబడిన ఆ శ్లోకాలలో కులవ్యవస్థ సంపూర్ణంగా తిరస్కరించబడింది, యజ్ఞ, యాగాది క్రతువులు తీవ్రంగా నిరసించబడ్డాయి. "అనుభవానికి అందనిదేదీ నమ్మదగినదికాదు" అని శ్రీరా మునికి బోధించిన జాబాలి (అయోధ్యకాండ) కూడా చార్వాక ధోరణికి చెందినవాడని పరిశోధకుల అభిప్రాయం. ఒక ప్రత్యేకమైన తర్కాన్ని, తాత్విక ధృక్పథాన్ని చార్వాకమతం ప్రచారం చేసింది.

పురాతన తాత్విక గ్రంథాలలో చార్వాక తత్వాన్ని నిందించడంకోసం వ్రాయబడిన అంశాలు గాక యిటీవలి కాలంలో చార్వాకుని గురించి వివరాలను గ్రహించడానికి శ్రీ దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ, డా॥ దక్షిణరంజన్ శాస్త్రి, శ్రీ రాజకృష్ణ ముఖర్జీ, శ్రీ బంకించంద్రం ఛటో పాధ్యాయ, శ్రీ ఎం. ఎన్. రాయ్, డా॥ ఎస్. ఎన్. దాస్ గుప్తల గ్రంథాలను పరిశీలించవచ్చును చార్వాక ధోరణి లోని వివిధ భౌతికవాద శాఖలకు చెందిన ఎందరో ప్రచా రకుల పేర్లు ఈ పరిశోధనల ద్వారా బయటపడ్డాయి. ఉదా॥ అజిత కేశకంబళుడు, మక్కలిఘోషాల్, ప్రకృధ కాత్యా

యున, ఈ భౌతిక వాదులను శాసకవర్గం నిర్దాక్షిణ్యంగా అణచివేసినట్లు కనుపిస్తున్నది. ప్రపంచమంతటా శాసకవర్గం తమ గుత్తపాలనాధికారాల రక్షణకై చేస్తూ వచ్చినపనే యిది. చార్వాక ప్రచారకుల వ్రాతలను గూడా నాశనం చేసివేశారు, పాలకులు.

చార్వాకుని పిదప భావ విప్లవాన్ని పెద్ద పెల్లుపలా తెచ్చినవారు గౌతమబుద్ధుడూ, మహావీరజైనుడూ. వీరు క్రీ॥ పూ॥ 400-500 మధ్యకాలం వారిని పరిశోధకుల అభిప్రాయం. వర్ణ సంకరం మూలంగా నూతన కులాలు ఆవిర్భవిస్తున్న కాలమది. దండెత్తివచ్చి గెలుపొందిన విదేశీయులను క్షత్రియులలో కలుపుకుంటూ, ఓటమి చెందిన వారినేమో హీనకులాలుగా అణగద్రొక్కుతూ వుండిన కాలమది. అలాంటి కాలంలో భగవంతుని అస్తిత్వంతో నిమిత్తంలేని భావప్రచారం ప్రారంభించాడు, బుద్ధుడు. కుల వ్యవస్థ మూలంగా అణచివేయబడ్తున్న వారే ఎక్కువ సంఖ్యలో ప్రారంభంలో బౌద్ధులైనట్లు కనుపిస్తున్నది. ఉదా॥ నాగజాతివారు.

బౌద్ధమతం దేవుని రస్తిత్వంతో సంబంధం లేనిది కాగా, జైనమతం నిరీశ్వర వాదాన్నే ప్రచారం చేసింది. ఈ ఉభయ మతాలూ కులవ్యవస్థను పూర్తిగా తిరస్కరించాయి. ఈ ఉభయ మతాలనూ బ్రాహ్మణ్యం చాలా తీవ్రంగా ఆణచివేయజూచింది. కాని, వాటి ప్రభావాన్ని

తోలగించడం బ్రాహ్మణ్యం వలనకాలేదు. బౌద్ధధర్మం బాగా విస్తరించి కులవ్యవస్థను దాదాపు విస్మరించే స్థితిని తెచ్చిన కాలంలోనే భారతదేశంలో శక్తివంతమైన మహా సామ్రాజ్యం మౌర్యుల నాయకత్వాన ఏర్పడింది. మౌర్యులు శూద్రులు. ఆ వంశంలోనివాడే ప్రభోక్తుడు. అతని కాలం సుమారు 300 క్రీ॥ పూ॥. నిజానికి అదే భారతదేశ చరిత్రలో స్వర్ణయుగం.

బౌద్ధం వ్యాపిస్తున్న కాలంలోనే దేశం మొత్తం మీద రాజ్యమైన ఐక్యత, పరాయి దండయాత్రల నెదుర్కొనే శక్తి, కళారంగంలో అభివృద్ధి సాధ్యపడ్డాయి. బౌద్ధం మూడు పనులను గొప్పగా సాధించ గలిగింది.

1. దేవుని అస్తిత్వం గురించికాక, భౌతిక ప్రపంచంలో కానవచ్చే దుఃఖాన్ని గురించి ఆలోచింపజేయడం.

2. కుల వ్యవస్థను సంపూర్ణంగా తిరస్కరించి, దళిత వర్గాల వారిని సాంఘికంగా విముక్తులను చేయడం.

3. ప్రజల భాష కాన్నట్టి సంస్కృతం బదులుగా సామాన్యుల భాషలైన పాలీ, ప్రాకృత వగైరా భాషలలో మత ప్రచారాన్ని, వైజ్ఞానిక పరిశోధన లనూ ప్రారంభించడం.

బౌద్ధమత విస్తరణ జరుగుతున్న కాలంలోనే విద్యాలయాలు విస్తృతంగా ఏర్పడ్డాయి, కళలు పోషించబడ్డాయి, రసాయన శాస్త్రమూ - యితర వైజ్ఞానిక శాస్త్రాలూ వ్యాపించాయి. ఆ కాలంలో భారత ప్రజలలో అణగివున్న తేజస్సుకూ, శక్తికీ విముక్తి లభించింది. అదే స్వర్ణయుగానికి కారణం.

బ్రాహ్మణవాదం తాత్కాలికంగా తలవంచినా తన నిజతత్వాన్ని వదలుకోలేదు. అశోకుని అనంతరం సైనిక తిరుగుబాటుల ద్వారా మౌర్యుల అధికారాన్ని కూలద్రోసి, బ్రాహ్మణవర్గం పక్షాన పుష్యమిత్రశుంగుడు సింహాసనమెక్కాడు. ఆ కాలంలోనే దేశంలో ఐక్యత విచ్ఛిన్నమై చిన్న చిన్న రాజ్యాలు తిరుగుబాట్లు చేశాయి. బౌద్ధమతం మీద దారుణమైన, అమానుషమైన బౌర్జన్యకాండ జరుపబడిన కాలమిదే.

మతల కులవ్యవస్థ

ఉపనిషత్తుల నాటినుండి శుంగుల కాలం వరకూ, దాదాపు వెయ్యి సంవత్సరాలు భారతదేశంలో ఈ వివిధ భావ ధోరణులకూ మధ్య సంఘర్షణ తీవ్రంగా సాగింది. మధ్య మధ్య హిందూమతం తన అస్తిత్వాన్ని నిలుపు

కోవడం కోసం ఉదారవాదపు ముసుగులేసుకోక తప్పలేదు. కాలక్రమేణా తిరుగుబాటు దాసులలోని మేధావి వర్గాలు అందరికీ ఆమోదయోగ్యం కావడం అనే ప్రలోభానికి లోనై రాజీ ధోరణులకు దిగజారడంతో తిరుగుబాటు దారులు వైఫల్యం చెందారు ఇలాంటి రాజీ ధోరణులకు ఒక ఉదాహరణ బౌద్ధమతంలోని మహాయాన శాఖ. క్రమంగా ఇలాంటి ధోరణులవలన బుద్ధుని తత్వంకంటె, బుద్ధి పూజకే ప్రాధాన్యత పెరిగింది. అదను చూచుకుని బ్రాహ్మణ్యం గూడా బుద్ధుని విగ్రహాలకు పూజలు ప్రారంభించింది. దానితో బౌద్ధమతం క్షీణదశను చేరుకున్నది. రాజీకి అంగీకరించని బౌద్ధ శాఖలు అల్ప సంఖ్యాకులకు పరిమితం కావడంవలన దారుణంగా అణచివేయడమో, దేశం నుండీ బహిష్కరించడమో జరిగింది.

భావవాదం యొక్క అపభ్రంశ రూపాలుగా చాల చోట్ల శాక్తేయమూ, పాశుపతమూ, కాపాలికమూ తదితర క్షుద్ర దేవతోపాసనా ధోరణులు బలపడసాగాయి. ఈ కాలానికి సంబంధించిన వివిధ తాత్విక, దార్శనిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక ధోరణులను కొంచెం వివరంగా పరిశీలించగలిగితే చాలా ఆసక్తిదాయకంగానూ, ప్రయోజనకరంగానూ గూడా వుంటుంది. శుంగులనుండి గుప్తరాజుల వరకూ సాగిన చరిత్ర వ్యక్తివాదమూ, ఆరాచక ధోరణులూ పరిగిపోవడానికి సాక్షిగా నిలచింది సంఘస్పృహ లోపించి. వ్యక్తి స్వార్థం విశృంఖలం కాసాగింది; రాజకీయ

ఐక్యత నశించి, దేశం చిన్న చిన్న రాజ్యాలుగా చీలి పోయింది: క్షుద్రదేవతోపాసన, మంత్ర-తంత్రాల పట్ల వ్యామోహమూ పెరిగిపోయింది. ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకొని అన్యజాతీయులు దేశంమీద దండయాత్రలు ప్రారంభించారు.

ఆ స్థితిలో ప్రజానీకం జాతీయభావమూ, రాజకీయ సుస్థిరత, సంఘవృష్టి ప్రసాదించగల నాయకత్వంకోసం ఎదురు చూడసాగారు. అలాంటి నాయకత్వాన్ని వారు గుప్తరాజులలో చూడగలిగారు. ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలచుకోవడంలో బ్రాహ్మణ్యం విఫలం కాలేదు. గుప్త సామ్రాట్టును నెమ్మదిగా ప్రభావితులను చేసి సనాతన ధర్మాన్ని పునఃప్రతిష్టచేయ బూనుకున్నారు. అందుకే గుప్త సామ్రాట్టుల కాలాన్ని పునరుజ్జీవన యుగమనీ, స్వర్ణ యుగమనీ బ్రాహ్మనవాదులూ, మేధావి వర్గమూ పొగడడాన్ని మనం చూస్తాం

ధార్మిక, సామాజిక రంగాలలో గుప్తరాజుల కాలంలో జరిగిన దేమిటి? బ్రాహ్మణ మతం జనాకర్షణకు కావలసిన క్రొత్త హంగులతో ముందుకు తేబడింది. కుల వ్యవస్థ "వర్ణాశ్రమ ధర్మం" అనే ముద్దు పేరుతో పంచదార పూయబడిన చేదు మాత్రవలె సమాజం గొంతులో వేయ బడింది. దేవాలయాలు నిర్మించబడ్డాయి. విగ్రహారాధనకు ప్రాధాన్యత పెరిగింది. ఇందులో బ్రాహ్మణ, బౌద్ధ, జైన

మతాలవారు పరస్పరం పోటీపడ నారంభించారు. బుద్ధుడు కూడా హిందూ, బ్రాహ్మణ దేవతలలో ఒకడై పోయాడు. సంస్కృతం తిరిగి రాజ్యమేల నారంభించింది. రామాయణ, భారతాది ఇతిహాసాలు యీ కాలంలోనే వ్రాయబడినవనేది అనేకమంది పరిశోధకుల అభిప్రాయం.

గుప్త వంశం క్రీ॥ శ॥ 320 నుండి సింహాసనంమీద వున్నట్లు అంచనా. రెండువందల ఏండ్లుకుపైగా సాగిన ఈ గుప్త పరిపాలనలో బ్రాహ్మణమతం క్రొత్త సొగసులతో మెల్లగా తిరిగి తల ఎత్తింది. కులవ్యవస్థమీద, సనాతన ధర్మంమీద ఆధారపడసాగిన గుప్త సామ్రాజ్యం ఎంతో కాలం పటిష్టంగా విదేశీ దురాక్రమణల నెదిరించి నిలువలేక పోయింది. హూణుల తాకిడికి గుప్త సామ్రాజ్యం పతనమై పోయింది. కాని, బ్రాహ్మణధర్మం మాత్రం తన పనిని విరమించలేదు. మరొక రెండువందల సంవత్సరాలు తీవ్రంగా కృషిచేసి తన వున్నత స్థితిని చేరుకున్నది. బ్రాహ్మణ ధర్మం. ఆ మధ్యకాలంలో బౌద్ధ ధర్మాన్ని ఆదరించే రాజులు కొందరు వుంటూనే వచ్చారు. అలాంటి వారిలో శ్రీహర్షుని పేరు మరవరానిది. ఇతడు బౌద్ధమతాభిమానియై వుండి బ్రాహ్మణ ధర్మాన్ని కూడా ఆదరించాడు. అయినా, బ్రాహ్మణ్యం అతనిమీద హత్యా ప్రయత్నాలు కూడా చేసింది. ఆ విధంగా తమ ప్రభావానికి తలవంచని రాజులను

సైతం వీలైతే హత్య చేయడానికి కులవ్యవస్థ యొక్క సమర్థకులు ఎన్నడూ వెనుకాడలేదు.

శంకరుని ప్రభావం

శంకరాచార్యుడు క్రీ॥ శ॥ 7, 8 శతాబ్దుల వాడు. ఆ నాటికి దేశంలో రాజకీయ ఏకాధిపత్యం లోపించివున్నది. బ్రాహ్మణ ధర్మంగూడా వైష్ణవ, శైవ వగైరా శాఖోపశాఖలుగా చీలిపోతూ పరస్పర పోటీలలో చిక్కుకొని వున్నది. ఆ స్థితిలో వేదప్రమాణాన్ని అంగీకరించే వివిధ మత శాఖలనూ ఏకంచేసి బౌద్ధం వంటి వైదికేతర మతాలపైన ధ్వజం లేపాడు, శంకరుడు. అందుకాతను లేవదీసిన సిద్ధాంతమే అద్వైత సిద్ధాంతం. కర్మసిద్ధాంతాన్ని, పునర్జన్మవాదాన్ని, మిథ్యావాదాన్ని ప్రచారం చేశాడు; అందు కవసరమైన తర్కాన్ని సమర్థతో రూపొందించాడు. రాజీ భోరణులకు దిగజారిన 'మహాయాన' బౌద్ధుల శూన్యవాదానికీ, శంకరుని మిథ్యావాదానికీ తేడా చాలా తక్కువయినందున శంకరుని పని మరింత సులభమైంది.

శంకరుడు కులవ్యవస్థ గురించి చాలా చిత్రమైన ధోరణిని అవలంభించాడు. అద్వైత సిద్ధాంతం ప్రాతిపదికగా చూస్తే కుల బేధాలు పాటించడం సమర్థనీయం కాదంటూనే, అంతటి అద్వైతసిద్ధి లభించనంతవరకూ లోక వ్యవహారా

నికి కట్టుబడి వర్ణాశ్రమ ధరాన్ని పాటించే తీరాలని శంకరుడు చెప్పాడు. శంకరుడు హింమూమతంలోని అన్ని శాఖల మధ్యా సమన్వయం, రాజీసాధించే ప్రయత్నం చేశాడు - చాలవరకు సాధించాడు. ఆచరణలో కులవ్యవస్థను బాగా బలపరచాడు. అద్వైతవాదం, కర్మసిద్ధాంతముల ద్వారా బౌతికవాదాన్ని ప్రతిఘటించినాడు. అవసరమైతే బలప్రయోగం చేసియైనా సరే కాపాలికాది ఘోరణులను అణచివేశాడు. బౌద్ధంపై శంకరుని విజయానికి ప్రభువుల రాజ్యాధికారమూ, శంకరుని తర్క పాండిత్యమూ, బౌద్ధంలో ప్రవేసించిన రాజీఘోరణులు - అన్నీ కారణభూతాలే అయినాయి.

స్థూలంగా- యీనాటి హింమూమతం, కులవ్యవస్థ సహితంగా, శంకరుడు ఏర్పాటు చేసినదేనని చెప్పవచ్చును.

శంకరాచార్యుని అనంతరం అతడు రూపొందించిన వ్యవస్థపై పెద్ద తిరుగుబాటంటూ జరుగలేదు. హీనకులాల వారుగూడా కర్మసిద్ధాంతాన్ని నమ్మి తమపట్ల మోపబడుతున్న విచక్షణ సహేతుకమైనదని, న్యాయమైనదనీ భావించే స్థితికి చేరుకున్నారు. అయితే, అప్పుడప్పుడూ కొందరు సంస్కర్తలు మాత్రం ఈ కులవ్యవస్థను కొంత మెత్తబరచడానికీ, కొన్ని దురాచారాలను విరమింప జేయడానికీ కృషి చేస్తూనే వచ్చారు.

81

భక్తివాద ధోరణులు

శంకరుని తత్వంతో విభేధించిన వారసేకులు తమ తమ భావాలను ప్రచారంచేస్తూ పచ్చారు. క్రీ॥ శ॥ 500 నుండి క్రీ॥ శ॥ 900 మధ్యకాలంలో తమిళ ప్రాంతంలో భక్తివాద భావాను ప్రచారంచేసిన పన్నెండుమంది ఆళ్వారులు కులాల కట్టుబాట్లను తిరస్కరించారు. ఈ ఆళ్వారులు విష్ణు భక్తులు. వీరు తమ తమ గ్రంథాలను సంస్కృతంలో గాక ప్రజల భాషయైన తమిళంలో వ్రాశారు. ఈ ఆళ్వార్లలో అన్ని కులాలవారూ వున్నారు. ప్రధానంగా శూద్రులూ, స్త్రీలూ ఈ భావధోరణులకు నాయకత్వం వహించారు. ఈ ధోరణులకు ఒక తాత్వికమైన రూపం యిచ్చినవాడు రామానుజుడు. ఇతడు క్రీ॥ శ॥ 1017లో జన్మించాడని చెప్పబడుతున్నది. ఈతడు జన్మతః నాలుగు కులాలు ఏర్పడతాయనే వాదాన్ని స్పష్టంగా తిరస్కరించాడు. 12వ శతాబ్దిలో తెలుగు ప్రాంతంలో పల్నాటి బ్రహ్మనాయుడు వీరవైష్ణవాన్ని ప్రచారంచేశాడు, విభిన్న కులాలమధ్య సమానత్వాన్ని వాంఛిస్తూ సంహపంక్తి భోజనాలను ప్రవేశపెట్టి, హరిజనులకుసైతం దేవాలయ ప్రవేశం కల్పించినవాడు బ్రహ్మన్న. 11వ శతాబ్ది నాటికి రామానుజుని అనుచరులైన ఈ వైష్ణవులు రెండు వర్గాలుగా చీలిపోయారు. వీరిలో వీరవైష్ణవ సాంప్రదాయం పాటించే తెంగలై విభాగంవారు కులవ్యవస్థను తిరస్కరిస్తూనే వచ్చారు. వీరు తమ వ్యవహారాలను తమిళంలోనే సాగిస్తూ వచ్చారు.

ఉత్తర హిందూస్థానంలో భక్తిమార్గాన్ని ప్రచారం చేస్తూ కులవ్యవస్థను తిరస్కరించిన వారిలో చైతన్యస్వామిని చెప్పవలసి వుంటుంది. అయితే యీతని సాంప్రదాయాలు విశృంఖల వర్తనకు దారి తీయడంవలన అవి ఒక సంస్కార ణోద్యమ రూపాన్నిగూడా తీసుకోలేకపోయాయి. ఈ విశృంఖలతలేని రామభక్తి మార్గాన్ని ప్రచారం చేసిన రామానందుడు క్రీ॥శ॥ 1300కు చెందినవాడు. వివిధ కులాల మధ్య సమభావాన్ని ప్రచారంచేస్తూ కులాల పద్ధతినిగూడా తిరస్కరించాడు. అంతేగాక, హిందూ-ముస్లిం సఖ్యతను గూడా యీతని మతం ప్రచారం చేసింది. ఈతని 13 మంది ప్రధాన శిష్యులలో అన్ని కులాలవారూ వున్నారు వారిలోని వాడే రాం - రహీముల ఏకతను ప్రచారం చేసిన కబీరు. భగవంతుని ఆరాధన, భక్తి, ప్రపత్తులతో పాటు తోటి మానవులకు సేవచేయడం ముఖ్యమైనవనే సంస్కరణ ధోరణిని, ఉదారభావ ధోరణినీ ఈ రామభక్తులు ప్రారంభించారు. కబీరు తరువాత నామదేవుడూ, తుకారాం, జ్ఞానేశ్వరుడూ, మీరాబాయి మొదలైన వారనేకులు కులవ్యవస్థతో నిమిత్తంలేని భక్తిమార్గాన్ని అనుసరించారు. వీరందరూగూడా తత్వశాస్త్ర చర్చలకంటె ఆచరణకూ, అనుభూతికీ, మానవసేవకూ ప్రాధాన్యత నిచ్చారు.

కర్నాటక ప్రాంతంలో మధ్వుల మూఢాచార పద్ధతులకు వ్యతిరేకంగా శూద్రులు బసవేశ్వరుని వీరశైవాన్ని ఆశ్రయించారు. తెలుగు ప్రాంతాలలోగూడా యిది బాగా

విస్తరించింది. ఇదిగూడా కులవ్యవస్థతో సంబంధంలేని భక్తి మార్గమే.

గురునానక్ తన భక్తిమార్గాన్ని పంజాబులో బాగా ప్రచారం చేశాడు. కులాల పద్ధతిని ఖండించే, హిందూ – ముస్లిం వివాదాలను తిరస్కరించే సంస్కరణోద్యమంగా నానక్ చే ప్రారంభించబడిన శిఖ్కుపంథా క్రమంగా హిందూ మతానికి భిన్నమైన ప్రత్యేక మతరూపాన్ని తీసుకున్నది. ఏకేశ్వరోపాసనను వీరు ప్రచారం చేశారు.

ఈ భక్తివాదులంతా తమ ప్రచారాన్ని సంస్కృతంలోగాక వివిధ ప్రాంతీయ భాషలలో చేశారు. అతి సాధారణ ప్రజలు – ప్రధానంగా బ్రాహ్మణేతరులూ ఈ ధోరణులను ఎక్కువగా సమర్థించారు.

ఈ వుద్యమాలన్నీ కొంతకాలంపాటు కొన్ని ప్రాంతాలలో కులవ్యవస్థను సవాలు చేస్తూ పెరిగాయి. గాని విజయం మాత్రం వీటికి లభించలేదు. <u>సామరులమీద మేధావులు గెలిచారు</u>. కులవ్యవస్థ తిరిగి విజృంభించసాగింది. క్రమక్రమంగా ఈ భక్తి వుద్యమాలుగూడా కులవ్యవస్థయొక్క విషపు కౌగిలిలో పతనమైపోవడం జరిగింది. <u>కులవ్యవస్థను విస్మరించడమో, నిరాకరించడమో చేసిన ఈ భక్తివాదులు</u>

దానిని ధ్వంసం చేయడానికి కావలసిన తాత్విక పునాదులను నిర్మించలేకపోయారు. కులవ్యవస్థను సంపూర్ణంగా తిరస్కరించే ఇస్లాంమతం వ్యాపిస్తున్న కాలంలో ఇస్లాంమతం వైపుకు సాధారణ ప్రజలు వెళ్లువగా వెళ్ళిపోకుండా హిందూ సంఘాన్ని రక్షించుకోవడానికి ఒక మార్గంగా మాత్రం ఈ భక్తివాద ధోరణులను అతిచాకచక్యంగా వాడుకోగలిగింది హైందవ మేధావి వర్గం.

ఆధునిక యుగంలో సంస్కర్తలు – వివేకానందుడు

ఇస్లాం మతంనుండి హిందూ సంఘాన్ని రక్షించుకోవడానికి జరిగిన ప్రయత్నాలతోపాటు క్రైస్తవమతం నుండి కూడా హింసా సంఘం ఆత్మరక్షణ చేసుకోవాల్సిన అవసరం అనతికాలంలోనే కలిగింది. ఈ దశలోనే సాంఘిక దురాచారాలపైన సంస్కరణ వాదులు ధ్వజమెత్తారు. రాజా రామ్‌మోహనరాయ్, కేశవ చంద్రసేన్ మొదలైనవారు బ్రహ్మ సమాజాన్ని నెలకొల్పి, బలపరచారు. సతీసహగమనాన్ని నిరోధించడం, వితంతు, పునర్వివాహాలు జరిపించడం, విగ్రహారాధనను నిరాకరించడం, కులభేదాలు పాటించకపోవడం – యివి ఈ యుగ లక్షణాలు. ఈ ధోరణులను తెలుగు ప్రాంతాన వ్యాపింపజేసినవారు కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు ప్రభృతులు. ఇది పాశ్చాత్య నాగరికత, తాత్విక ధోరణుల ప్రభావం మూలంగా మధ్యతరగతి

మేధావి వర్గంలో సాగిన ఆలోచనా సరళి. కులవ్యవస్థను, హిందూ సంఘాన్ని పూర్తిగా మార్చగలిగిన శక్తి వీరికి లేకపోయినా సమకాలీన సమాజంలో చాలా తీవ్రమైన, త్వరితమైన మార్పులను సాధించిన ఘనత మాత్రం వీరిదే.

19వ శతాబ్దిలోనే దయానంద సరస్వతి ఆర్య సమాజాన్ని ప్రారంభించాడు. కులవ్యవస్థనూ, సాంఘిక దురాచారాలనూ ఖండిస్తూ తీవ్రమైన ప్రచారాన్ని సాగించినదీ సంస్థ. హిందూ సంఘంలో వున్న అనేక చెడులకు మూలాలపై దాడితో ప్రారంభమైన ఈ వుద్యమం ఒక చారిత్రక దశలో ప్రగతిశీలమైన పాత్రను నిర్వహించి, క్రమంగా హిందూ దురహంకారాన్ని ప్రోత్సహించే వుద్యమంగా దిగజారనారంభించినది. అసలైన, సిసలైన వైదిక మతాన్ని అనుసరించాలనీ — అందులో మూఢాచారాలకు, కులవ్యవస్థకూ స్థానం లేదనీ వీరి వాదన. ఒకవైపున జన్మనుబట్టి కులాలు అనే పద్ధతిని నిరసిస్తూనే, కర్మనుబట్టి కులాలు అనే పద్ధతిని ప్రవేశపెట్టిందీ వుద్యమం. ఇది ప్రాథమికంగా ఇస్లాం-క్రైస్తవ మతాల వైపుకు ప్రజలు పరుగెత్తకుండా ఆకట్టుకోవడానికే జరిగిన ప్రయత్నమనే విషయాన్ని మనం విస్మరించరాదు. అదే కాలానికి చెందినవాడు రామకృష్ణ పరమహంస. చైతన్యుని భక్తిమార్గానికి వేరొక రూపాంతరం రామకృష్ణుడు. ఈతని శిష్యుడు వివేకానందుడు. వీరందరికంటె ఎంతో

ఎత్తుకు ఎదిగి హిందూ సంఘం యొక్క అవలక్షణాలపై తాత్వికమైన దాడి జరిపినవాడు.

వివేకానందుడు భారతదేశంలో హిందూ ధర్మం పేరిట వుంటూ వచ్చిన మూఢాచారా లన్నింటిపైనా తీవ్ర మైన దాడి జరిపాడు. స్త్రీలపట్ల, కులవ్యవస్థ పట్ల అతని వైఖరి చాలా ప్రగతి శీలమైనది. దారిద్ర్యంనుండి సమా జాన్ని వుద్ధరించాలనే భావనగూడా వివేకానందున కున్నది. అతడు తాత్వికంగా భౌతికవాది కాడు. కాని సంకుచిత శ్రేణుల ఫలితంగా నవ్వులపాలై తన శక్తిని కోల్పోయిన హిందూ ధర్మాన్ని సంస్కరించి, దానికి జీవంపోయాలనీ, భారతజాతీయ పునర్వికాసానికి కృషి చేయాలనీ అతని ఆకాంక్ష. మానవసేవయే మాధవసేవగా భావించి పని చేశాడు. అతనంటాడు:

"నేను సోషలిష్టును. అంటే సోషలిజం పరిపూర్ణమైన వ్యవస్థయని నా అభిప్రాయంకాదు. కాని, సగంరొట్టి అసలు లేనిదానికంటె మేలు. మిగతా వ్యవస్థలన్నీ దారుణంగా విఫలమైనాయి. దీనినీ ప్రయత్నించి చూద్దాం. దేనికీ కాక పోయినా, దాని నవ్యత్వాన్ని చూసైనా దానిని అంగీక రిద్దాం." భారతదేశంయొక్క హీనదశను చూచి ఖేదపడి, దానిని ఆ హీనదశనుండి బయటకు లాగాలనే తపనతో తన పరిసరాలో తాను చిత్తశుద్ధితో నిర్వికామకృషి చేసినవాడు

వివేకానందుడు. ఆధ్యాత్మిక అవసరాలను, భౌతికమైనఅవసరాలనూ గూడా దృష్టిలోనికి తీసుకోగలిగినవాడతడు. అతని సమకాలీన వ్యవస్థను, పరిస్థితులనూ తృష్టిలో పెట్టుకున్నప్పుడు అతడొక గొప్ప తిరుగుబాటుదారుడుగా కనుపిస్తాడు అతనొకచోట అన్నమాటలు చూడండి: "భారత దేశానికి గల ఒకే ఒక ఆశ దాని సాధారణ ప్రజానీకం. వారే ఏదైన చెయ్యాలి ఆ దేశపు అగకులాలు, వర్గాలూ భౌతికంగానూ, నైతికంగానూ గూడా చచ్చిపోయేవున్నాయి." అదీ వివేకానందుని వేదన.

సాధారణ ప్రజల కొరకు వేదన, సాధారణ ప్రజల గురించిన తపన, సాధారణ ప్రజలమీద విశ్వాసంతో అచంచలమైన దీక్షతో కృషిచేశాడు. భావప్రచారంతో ఆగకుండా సేవాసంస్థల ద్వారానిర్మాణకృషిని చేపట్టాడు. ఆ విధంగా భారతీయ సామాజిక చరిత్రలో వివేకానందుడు చాలా ప్రయోజనకరమైన పాత్రను నిర్వహించాడు. ఆ తరువాత కాలంలో జాతీయ విముక్తి పోరాటంలో బలిదానాలకు సిద్ధపడిన అనేకమంది విప్లవకారులు వివేకానంద బోధనలనుండి వుత్తేజాన్ని పొందినవారే. 1902లో తన 31వ ఏటనే వివేకానందుడు మరణించాడు.

బ్రాహ్మణే తరోద్యమాలు

సంస్కరణోద్యమాలు సాగుతున్న కాలంలోనే కొన్ని ప్రాంతాలలో బ్రాహ్మణే తరోద్యమాలు ప్రారంభ

మైనాయి. కేరళ ప్రాంతంలో నారాయణగురు అనే శూద్రుడు దేవాలయాలు బ్రాహ్మణుల గుత్త సొత్తుకాదని తిరుగుబాటు చేశాడు. శూద్రులలో భక్తి ప్రబోధంచేసి, బ్రాహ్మణులకంటె తాము తక్కువ కాదనే ఒక ఆత్మ విశ్వాసం కలిగించి సాంఘిక న్యాయంకోసం పోరాడేటట్లు చేశాడు.

'శ్రీ నారాయణ ధర్మ పరిపాలన' అనే సంస్థ నేటి వరకూ ఈ వుద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తూనే వున్నది. ఆ తరువాత రోజులలో తమిళనాడు, తెలుగునాడు ప్రాంతాలలో బ్రాహ్మణేతరోద్యమం వివిధ రూపాలలో బలపడింది. 20వ శతాబ్ది ప్రథమ భాగంలో దీనియొక్క శక్తి బాగా పుంజుకున్నది. తమిళనాడులో ఇ. వి. రామస్వామి నాయకర్, తెలుగునాట త్రిపురనేని రామస్వామిచౌదరి ఈ వుద్యమాలకు నాయకత్వం వహించారు.

ఈ వుద్యమంయొక్క వ్యక్తీకరణ రకరకాల పద్ధతులలో జరిగింది. వివిధ ద్విజేతర కులాలవారు తమతమ కులాల ఆభిజాత్యాన్ని, ప్రాచీనత్వాన్ని చాటుకోవడం ఒక పద్ధతి.

కొన్ని పెత్తందారీ కులాలవారు (ఉదా॥ కమ్మ) తాము శూద్రులము కామనీ క్షత్రియులమనీ చెప్పుకోవడం ప్రారంభించారు. 'గొల్ల' శబ్దాన్ని 'యాదవ' శబ్దంగానూ

'పల్లెకార్లు' పదాన్ని 'అగ్నికుల క్షత్రియ' అనీ – యిలా ప్రతి కులంవారూ తమ వంశకర్త ఏ చంద్రుడో, ఇంద్రుడో అని నిరూపించి సంతృప్తి పడడం ప్రారంభమైంది.

స్వసంఘ పౌరోహిత్యం ఒక ప్రధానమైన వ్యక్తీకరణ. ఆయా కులాలవారే జంధ్యాలు వేసుకొని బ్రాహ్మణ పురోహితులతో సంబంధం లేకుండా వేదయుక్తంగా పెండ్లిండ్లు జరుప నారంభించారు. కొన్నిచోట్ల మాత్రాలు సంస్కృతంలో చదివే పద్ధతిగూడా విరమించబడి ప్రమాణాలు మాతృ భాషలలోనే చేయనారంభించారు.

ఈ వుద్యమం ద్రావిడ వుద్యమ రూపాన్ని గూడా తీసుకోవడం జరిగింది. బ్రాహ్మణులు ఆర్యజాతికి ప్రతినిధులనీ, మిగతావారు ద్రావిడులమనీ చెప్పబడింది. ఆ విధంగా బ్రాహ్మణులపట్ల 'జాతిద్వేషం' ప్రచారం చేయబడింది. పురాణాలనూ, ఇతిహాసాలనూ "బ్రాహ్మణుల దొంగ వ్రాతలు"గా నిరసించడం ప్రారంభమైంది.

వందల ఏండ్లుగా అన్ని అవకాశాలనూ గుత్తకు తీసుకున్న బ్రాహ్మణులను తగ్గించి, తమకు కొన్ని స్థానాలను అన్ని రంగాలలోనూ ప్రత్యేకించాలంటూ ప్రత్యేకావకాశాల నినాదం లేవదీయబడింది. సాంఘిక న్యాయం పేరిట లేవదీయబడిన ఈ నినాదానికి రాజకీయ వ్యక్తీకరణ అనాటి

జస్టిస్ పార్టి. ఏ కులానికి ఆ కులంవారు నిధులు వసూలుచేసి ధర్మసంస్థలు నెలకొల్పి విద్యా సంస్థలను, వసతి గృహాలనూ, స్కాలర్‌షిప్పులనూ ఏర్పాటుచేసుకో నారంభించారు.

ఈ బ్రాహ్మణే తరోద్యమం దాదాపు మూడు దశా బ్దాలకు పైగా యావత్తు దక్షిణ భారతాన్ని ప్రభావితం చేసింది. బ్రాహ్మణే తరులైన జమీందారులు, భూస్వా ములూ బ్రాహ్మణులనుండి అధికారాన్ని తమ వశం చేసు కోవడానికి ఈ పోరాటాలను పూర్తిగా వినియోగించుకోవడం జరిగింది.

జాతీయ కాంగ్రెసు బ్రాహ్మణుల అధీనంలో వున్న దన్న కారణంగా దానిని వ్యతిరేకించి, బ్రిటీషు సామ్రాజ్య వాదులతో చేతులు కలిపే దశకు గూడా ఒక సమయంలో ఈ వుద్యమం చేరుకున్నది. ఆ రకంగా సాంఘికంగా ప్రగతి శీలమైన వుద్యమం రాజకీయంగా అభివృద్ధి నిరోధకమైన వైఖరిని తీసుకున్నది. బ్రాహ్మణుల నుండి తాము సాధించు కున్న అధికారాలను తమకంటె దిగువనున్న కులాలతో పంచుకోవడానికి పెత్తందారీ కులాలు నిరాకరించడంతో సాంఘికంగా ప్రగతిశీల స్వభావాన్నిగూడా అది కోల్పోవ నారంభించింది. కాని అదేసమయంలో అది మధ్యతరగతి వైతాంగంయొక్క నాయకత్వాన సాగిన వైతు వుద్యమా లను మాత్రం సాధారణంగా బలపరుస్తూ వచ్చింది. క్రమంగా 1930 తర్వాత జాతీయ విముక్తి పోరాటంలోనికి గూడా ఈ వుద్యమ కార్యకర్తలు ప్రవేశించారు.

ఆ వుద్యమం మొత్తం కులవ్యవస్థకు వ్యతిరేకంగా, సమగ్ర సాంఘిక న్యాయంకోసం కాక ఒక కులంయొక్క గుత్తాధిపత్యానికి వ్యతిరేకంగా మరికొన్ని కులాలు సాగించిన ప్రతీకారంగానే రూపొందడమనేది ఈ వూగిసలాటకూ, కప్పదాట్లకూ మూలకారణం. స్పష్టమైన అవగాహన, తాత్వికమైన ప్రాతిపదిక లేని కారణంగానే ఈ వుద్యమం అనేకమైన తప్పిదాలు చేస్తూ వచ్చింది. అందువలన ఈ వుద్యమం సాధించిన సత్ఫలితాలు సమాజం మొత్తంగా అనుభవించడానికి వీలు కలుగలేదు.

గాంధీజీ మార్గం

జాతీయోద్యమం ప్రారంభ దినాలలో ఎగువ తరగతి, మధ్యతరగతి మేధావుల నాయకత్వంలో ఉండేది. సాధారణ ప్రజలలో సానుభూతి వున్నాగూడా ఈ ప్రజల భాగస్వామ్యం మాత్రం ఆ వుద్యమంలో లేదు.

నిజానికి దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటాలన్నీ విఫలమవుతూ రావడానికి ప్రధానకారణం కులవ్యవస్థేనని చరిత్ర మనకు బుజువు చేస్తూంది. సిరాజుద్దౌలా మొదలుకొని కాంగ్రెసు స్థాపన వరకూ సాగిన చరిత్రలో ఎక్కడా కూడా హిందూ-ముస్లిం సంఘర్షణల మూలంగా భారతజాతి ఓడి

పోయిన ఘట్టం లేదు. కాని ఎవరి కులాన్ని వారు నిలుపుకొనే ప్రయత్నములో ఎప్పటి కప్పుడు కొన్ని కులాలవారు బ్రిటీషు వారికి దాసోహమంటూ వచ్చారు. బ్రిటీష్ సామ్రాజ్యాధికారానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలను సమర్థించే సామాన్య ప్రజలకు ఆ పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశాలు మాత్రము లేవు. దీనికి కులవ్యవస్థే ప్రధానకారణం. కత్తిపట్టుకునే అవకాశం కూడా అనేక కులాలకు తిరస్కరించబడినది.

సామాన్య ప్రజల సంపూర్ణ సహకారం, భాగ స్వామ్యం లభించాలంటే హిందూ సంఘంలోని దుర్లక్షణాలను తొలగించక తప్పదని గాంధీజీ గుర్తించాడు. ప్రధానంగా అస్పృశ్యతా నివారణకు ఆయన పూనుకొని, దాని నొక వుద్యమంగా రూపొందించాడు.

1936 జులై 18 "హరిజన్" పత్రికలో ఆయన యిలా వ్రాశాడు:

"ఈ కులవ్యవస్థ దేశాభివృద్ధికే, ఆధ్యాత్మికాభివృద్ధికే హానికరమైనదని నే నెరుగుదును... వర్ణాశ్రమ వ్యవస్థలకు కులాలతో ఏమాత్రమూ సంబంధంలేదు. భుక్తికోసం వంశపారంపర్యంగ అనుసరిస్తున్న వృత్తిని తెలిపేది వర్ణం. వర్ణవ్యవస్థలో అస్పృశ్యతకు తావులేదు." చాలా తీవ్ర

మైనదిగా కనుపించే ఈ ధోరణి నిజానికి కులవ్యవస్థయొక్క మూలాన్ని తొలగించగలిగేదిగా లేదు. సంస్కరణ వాదులలో వుండే వూగిసలాటకు గాంధీజీయే నిదర్శనం. అస్పృశ్యతా నివారణ స్థాయిని దాటి అయన వెళ్ళలేకపోయినాడు. నిజానికి వర్ణాశ్రమధర్మం గురించి గాంధీజీ చేసిన ఈ వ్యాఖ్యానం దయానందుని (ఆర్యసమాజం) వ్యాఖ్యానం కంటే గూడ తక్కువస్థాయిలో వున్నది. ఒకవ్యక్తి స్వతఃఎంచి అనుసరించే వృత్తినిబట్టే అతని వర్ణం నిర్ధారణ అవుతుందని ఆర్య సమాజీకుల వ్యాఖ్యానంకాగా, గాంధీజీ మాత్రం దానిని వంశగతమైనదిగా ఆమోదించడం జరిగింది.

అంటే గాంధీజీ కులాలు జన్మతః ఏర్పడతాయనే భావనను తిరస్కరించకుండానే వివిధ కులాల మధ్య సమభావాన్ని మాత్రం ప్రచారం చేశారన్నమాట. అయితే జన్మతః కులాలు ఏర్పడడం అనే అంశంలోనే మేధావి వర్గీయుల కులం మిగతా కులాలను వంచనచేసి, తన ఔన్నత్యాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవడానికి కృషిచేసే ప్రమాదం యిమిడి వున్నదని గాంధీజీ గుర్తించలేదు. జన్మతః ఒక మనిషి ఒక కులానికి కట్టుబడి వుండిపోవాల్సిన పరిస్థితి తప్పనిసరిగా నిచ్చెనమెట్ల సమాజానికే దారి తీస్తుందని అయన విస్మరించాడు. వృత్తులలో ఎక్కువ తక్కువలు లేవనీ, అందరిస్థాయీ ఒక్కటేననీ అయన వూహించడం జరి

గింది అందుకే అస్పృశ్యతా నివారణతో చాలా సమస్యలు తీరిపోగలవని ఆయన భావించాడు. 15-8-1936 "హరిజన్"లో ఆయన యిలా వ్రాశాడు:

"అస్పృశ్యతను శాస్త్రాలు సమర్థించినట్లయితే నేను సైతం హిందువుడినని చెప్పుకునేటందుకు సమ్మతించను." ఈ పంథా ఆయనలోని మానవతా దృష్టినే చూపిస్తుంది దప్ప ఆయనను మొత్తం కులవ్యవస్థనే నిర్మూలించగోరే విప్లవ వాదిగా నిరూపించదు.

సంస్కర్తల వైఫల్యానికి కారణం?

వేల సంవత్సరాలుగా అనేకమంది సంస్కర్తలు కుల వ్యవస్థకు వ్యతిరేకంగా కృషిచేసిగూడా ఎందుకు విఫలులైనారన్న ప్రశ్నకు సమాధానంగా 1936లో జాత్-పాత్ తోడక్ మండలి అధ్యక్షోపన్యాసంలో డా॥ అంబేద్కర్ యిలా చెప్పారు:

"సంస్కర్తకు హేతువాదం, నైతికవాదం అనేవి రెండు ముఖ్యమైన ఆయుధాలు. కాని, హిందూ శాస్త్ర బంధితుడైన హిందువునిపట్ల ఈ రెండింటినీ గూడా సంస్కర్త వుపయోగించజాలడు. నైతిక దృష్టితో పరిశీలించేటందుకే ప్రజలకు మతరీత్యా స్వేచ్ఛలేనపుడు, వారిని కులాలను

వదలివేయమని ఎలా చెప్పడం?.... ఈ కులాలు అనే గోడలను కూల్చివేయాలంటే ముందుగా హేతువాదానికి, నైతిక దృక్పథానికీగూడా అడ్డుగా నిలుస్తున్న వేద శాస్త్రాలను తుదముట్టించాలి.... ఈ శ్రుతులకూ, స్మృతులకూ నిలయమైన మత్తాన్ని సైతం నిర్మూలించివేయాలి."

హిందూ ఛాందసం• తర్కదృష్టికి ఎంత దూరంగా వుంటుందో రుజువుచేయడానికి ఆయన మనుధర్మాన్నే ఉదాహరించి చెప్పారు. మనువు మాటలివి:

"యద్యదా చర్యతేయేన ధర్మంవా ధర్మమేవవా
దేశస్యా చరణం నిత్యం చరిత్రం తద్బికీర్తితమ్!"

సదాచారం అంగీకరించని విషయాలను శ్రుతులు, స్మృతులూ అంగీకరించినాసరే, కాక-దేవుడే వచ్చి ఫలానా మాట చెప్పాడన్నా సరే లెక్కచేయరాదని మనువు శాసనం. ఇంతకూ సదాచారమంటే ఏమిటో పైన చెప్పిన శ్లోకం వివరిస్తుంది. సదాచారమంటే పూర్వాచారమేనట. ధర్మా ధర్మాలతోగానీ, శాస్త్ర చర్చతోగానీ నిమిత్తం లేకుండా సదాచారాన్ని పాటించి తీరాలట. అంతేకాదు, ధర్మశాస్త్ర విషయాలలో ఏమైనా వివాదాలు వస్తే వాటికి బ్రాహ్మణుడు ఏ విధమైన భాష్యం చెబుతాడో, అదే అనుసరణీయమైన ధర్మమట:

"అనామ్నాతేషు ధర్మేషు కథం స్యాదితి చేద్భవేత్
యంశిష్టా బ్రాహ్మణా బూయుః సధర్మః స్యాదశంకితః."

ఇంత మూఢాన్ని ప్రచారం చేసే గ్రంథాలను ప్రామాణికాలుగా ఆమోదిస్తూ సంస్కరణ జరగాలంటే సాధ్యమా? వాటిని నిర్మొహమాటంగా త్రోసి రాజన లేక పోవడం సంస్కర్తల వైఫల్యానికి ఎంతో ముఖ్యమైన కారణమనేది నిస్సందేహం. చార్వాక, బౌద్ధ, జైన మతాలు మినహాగా మిగిలిన వుద్యమాలన్నీ ఏదో ఒక రూపంలో వేద ప్రమాణాన్ని అంగీకరించాయి. ఈ వాదాలన్నిగూడా మన అనుభవంలో వున్నవాటిని మించినదేదో ఒక టున్నదని ముందుగా అంగీకరించేసి, దాని స్వరూప స్వభావాల నిర్ధారణకోసం కుస్తీలు పడుతూవుంటాయి. అందువలన హేతువు, తర్కము పనికిరాకుండాపోయి, వాటి స్థానాన్ని అంధ విశ్వాసం ఆక్రమించింది.

అంధ విశ్వాసాన్ని తిరస్కరించి హేతుదృష్టినీ, భౌతిక వాదాన్ని స్వీకరించినందువల్లనే చార్వాక, బౌద్ధ, జైనమతాలు కనీసం కొంతకాలంపాటు కులన్యవస్థ ఉనికిని సవాలు చేయగలిగాయి. వాటిలో బౌద్ధం దాదాపు 1000 సంవత్సరాలపాటు హిందూ సమాజాన్నే సవాలు చేయగలిగింది. అందువల్లనే అది హిందూమతంలో ఒక శాఖగా గాక, వేరే మతంగా రూపొందినది.

ఈ సమస్యను గురించే డా॥ లోహియా యిలా ప్రకారు:

"ఫాందసవాదం గురించి హిందూ మేధస్సు యింత వరకు ఎన్నడూ పరిశుభ్రం కాలేదనేది నిర్వివాదాంశం... ఎంతవరకైతే కులం అనేది హిందూమేధస్సునుండి పూర్తిగా తొలగిపోదో, ఎంతవరకైతే స్త్రీని పురుషునితో సమానంగా చూడడం ప్రారంభంకాదో అప్పటి వరకూ ఫాందసవాదం తన దుష్టపాత్రను భారతదేశ చరిత్రలో వహిస్తూనే వుంటుంది... ఇతర మతాలవలె హిందూమతం కేవలం కొన్ని తాత్విక భావనలమీద ఆధారపడిన మతం కాదు. అది ఒక సాంఘిక వ్యవస్థ. అందువల్లనే ఫాందస ధోరణులకూ, ఉదార వాదానికీ (లిబరలిజం) మధ్య సంఘర్షణ నిర్ణయాత్మక దశను చేరుకోలేదు: బ్రాహ్మణ - వైశ్య కూటమి దేశాన్నింతవరకూ పరిపాలిస్తూనే వున్నది...

...ఈ పరిస్థితి వెనుక ఒక తాత్వికమైన సమస్య వున్నది. మనకు అనుభవంలోనికి వచ్చేవాటికీ, అసలు సత్యానికి మధ్య వుండే సంబంధాన్ని గురించినదే ఆ సమస్య. హిందూ ఫాందసవాదమూ, ఉదారవాదమూ గూడా సత్యాన్ని దర్శించడంకోసం మన అనుభవంలోనికి రాగల వాటిని దాటివెళ్ళి అన్వేషిస్తున్నాయి... అన్ని దేశాల లోనూ అన్ని తత్వశాస్త్రాలూ ఈ సమస్యను చర్చించాయి. కాని, మిగతా దేశాలలో అది ఒక తాత్వికమైన ప్రశ్నగా

మాత్రం చర్చించబడగా, భారతదేశంలో యిది సాధారణ ప్రజల విశ్వాసాలకు సంబంధించినదిగా మారింది ..."

("హిందు వర్సస్ హిందు" అనే వ్యాసంనుండి)

హిందూమతంలో అంధ విశ్వాసాలను, తప్పుడు భావాలనూ, కట్టుకథలనూ ప్రచారంచేసే శక్తివంతమైన సాధనాలు - హిందూమత గ్రంథాలు. వాటిని గుడ్డిగా నమ్మడం మానివేస్తే తప్ప యీ అంధ విశ్వాసాలనుండి విముక్తి పొందడం సాధ్యంకాదు. హిందూ సమాజంలో సంస్కరణలు కోరుతూ, మతాన్ని మార్చి గొప్పగా గౌరవిస్తూ వుండిన గాంధీ మహాత్ముడు వ్రాసిన మాటలనే చూడండి. 1936 జులై 18వ తేదీ "హరిజన్" పత్రికలో యిలా వ్రాశారు:

"వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, పురాణాల మొదలు రామాయణ మహాభారతాల వరకూ అన్నీ హిందూమత గ్రంథాలే. అంతటితో ఆఖరుకాలేదు. ప్రతి తరంలోనూ ఒకొక్క నూతన గ్రంథం చొప్పున ఉద్భవించి ఈ జాబితాలో చేరుతోంది. అందుచేత అవన్నీ ప్రామాణికమైనవే నసేటందుకు వీలులేదు ... హేతువాదానికీ, ఆధ్యాత్మిక అనుభవానికీ నిలువజాలని అంశాలు మత గ్రంథాలలో వున్నప్పటికీ, అవి భగవంతునిచే చెప్పబడినవని నమ్మేటందుకు వీలులేదు,"

అంబేద్కర్ విమర్శ

చిత్రమేమిటంటే, యీనాడుగూడా ఏదోఒక సాకుతో కులవ్యవస్థను సమర్థించడానికి పూనుకునేవారు కనుపిస్తూనే వున్నారు. నాగరిక వ్యవస్థలో శ్రమవిభజన అవసరం గనుకను, కులవ్యవస్థ శ్రమవిభజన కోసమే ఏర్పడింది గనుకనూ, కులవ్యవస్థ కొనసాగడం అవసరమనే వాదన ఒకటి యిటీవల వినిపిస్తోంది.

ఈ వాదనకు డా|| అంబేద్కర్ యిచ్చిన సమాధానం చూడండి :

"కులవ్యవస్థ పేరుతో శ్రమ విభజనే గాక, శ్రామికుల విభజన గూడా జరిగింది. నాగరిక వ్యవస్థలో వృత్తి విభజన సహజం. కాని శ్రమ విభజన పేరుతో శ్రామికులనే వేరు వేరు వర్ణాలుగా విడదీసే అసహజమైన పద్ధతి మరే నాగరిక వ్యవస్థలోనూ లేదు. ఈ కులవ్యవస్థ మూలంగా వృత్తులు వంశానుగతమై, వాటిలో వుచ్చ-నీచ భేదాలు పేర్పడ్డాయి. ఈ విధానాన్ని బట్టి వృత్తి నిర్ణయంలో వ్యక్తి యొక్క అభిరుచులతో నిమిత్తంలేదు... పుట్టుకతోనే తాత ముత్తాతల వృత్తి అతనికి ఖాయమవుతోంది... పారిశ్రామిక రంగమనేది ఎదుగు బొదుగూ లేని జడవ్యవస్థ కాదు...

అనుక్షణం అనేకమైన మార్పులొస్తున్నాయి... శ్రామికుడు సైతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన శ్రామిక పాటవాన్ని పెంపొందించుకునే స్వేచ్ఛ కలిగివుండాలి... కులవ్యవస్థ అందుకు అంగీకరించదు..."

డా॥ బి. ఆర్. అంబేద్కర్ జన్మతః హరిజనుడు. సమాజంలో అట్టడుగు కులాలపై ఈ నాటికీ సాగుతున్న దౌర్జన్యాలను స్వయంగా అనుభవించినవాడు కావడం ఆయన కులవ్యవస్థపై చేసినదాడి చాలా తీవ్రమైనదిగానూ, సూటిగానూ వుంది. డా॥ అంబేద్కరు గొప్ప పండితుడు, న్యాయ శాస్త్రవేత్త. ఆయన వాదనలు చాలా బలంగానూ, శక్తివంతంగానూ గూడా వుంటాయి. నిజం నిర్మొహమాటంగా చెప్పేటప్పుడు ఒక్కొక్కసారి కర్కశంగా కనుపించవచ్చును. అయినా సత్యం సత్యమే.

కులవ్యవస్థయొక్క అమానుష లక్షణాలను ఎత్తి చూపిస్తూ డా॥ అంబేద్కరు యిలా అన్నారు:

"కులవ్యవస్థ ప్రభావం వలన ఒకడు మరొకడిని తన కంటె తక్కువ వాడిగా పుట్టుకతోనే పరిగణిస్తున్నాడు. తన కులంవారిని గౌరవించిన విధంగా మరొక కులంవారిని గౌరవించలేకపోతూ వున్నాడు. ప్రజలందరనూ సోదరభావంతో చూడడమనేది హిందువులకు అసాధ్యమయింది... దీనిని

బట్టి సత్పురుషుడైన హిందువుడంటూ వుండజాలడని తేలి పోయింది. అంటే, దీని అర్థం హిందువుడి వ్యక్తిగత నడవడిలో తప్పు వున్నదనికాదు. సామాజిక వ్యవస్థలో అవినాభావ సంబంధాల విషయమై మౌలికమైన లోపం వుండడమే దీనికి కారణం..."

డా॥ అంబేద్కరు యింకా యిలా వ్రాశారు :

"అతి ముఖ్యమైన సైనిక, రాజకీయ, విద్యావకాశాలు భారతదేశంలో అత్యధికులకు లేనేలేవు. ఈ వ్యవస్థ ఫలితంగా హిందూ సమాజంలో కొందరు నిర్వీర్యులుగను, కొందరు నిస్సహాయులుగనూ, మరికొందరు నిష్ప్రయోజకులుగనూ తయారైనారు..."

వంశ పవిత్రత, మంచి సంతానంవంటి మాటలతో కులవ్యవస్థను సమర్థించేవారికి డా॥ అంబేద్కరు యిలా సమాధానం చెప్పాడు :

"కులవ్యవస్థను సమర్థించేటందుకు వంశ పవిత్రత, వుత్తమ సంతానంవంటి నానాచెత్తా మాట్లాడుతున్నారు. ఈ హిందూమతం సృష్టించిన జనాభా ఎలాంటిది? భౌతికంగా చూస్తే హిందువులు 'సి' స్థాయికి చెందినవారు. అంటే యీ తరహా ప్రజలు సాధారణంగా పొట్టిగానూ, మరుగుజ్జులుగానూ వుంటూ స్థయిర్యాన్ని కోల్పోయి

వుంటారు. పదింట తొమ్మిది మందిని సైన్యంలోనికి పనికి రాని వారుగా తయారుచేసిన మతమిది..."

బ్రాహ్మణుల 'పవిత్రత'ను గురించి ఆయన యిలా ప్రశ్నించారు :

"దయాపూరితుడైన విష్ణువుకు పూజారి బ్రాహ్మణుడు. సర్వ వినాశకుడైన శివునికీ పూజారి బ్రాహ్మణుడే. బుద్ధుని పేర గయలోవున్న దేవాలయానికీ పూజారి బ్రాహ్మణుడే. రక్తపిపాసియైన కాళికాదేవికీ పూజారి బ్రాహ్మణుడే. క్షత్రియుడైన రామునికీ.... (క్షత్రి)య సంహారార్థమై అవతరించినట్లు చెప్పబడే పరశురామునికీ గూడా పూజారి బ్రాహ్మణుడే... పీరులకు గూడా బ్రాహ్మణుడే పూజారి అవుతున్నాడు. ఎన్ని చెప్పినప్పటికీ గూడా కేవలం అర్జునా దృష్టితోనే ఇన్ని దేవుళ్ళకు ఒకేసారి కొలుపుచేయ గల్గుతున్నామన్న వాస్తవం కొట్టవచ్చినట్లు కనుపిస్తున్నది... ఇందులో ఒక సిద్ధాంతానికి కట్టుబడి వుండకపోవడం కనుపించడం లేదా? వీటిలో సహనరూపంలో కనుపించేది నిజానికి అవినీతి మాత్రమే...."

హిందూమతంలో వున్నదని చెప్పబడే సహన శీలత గురించి అంబేద్కరు యింకా యిలా వ్రాశారు :

"ఆటవిక జీవనం కొనసాగిస్తున్న ఆదిమ తెగలవారిని నాగరిక పరచే విషయంలో హిందువు లేమాత్రమూ శ్రద్ధ

చూపకపోగా, హిందువులలో అంతర్భాగంగా పరిగణించ బడ్తున్న తక్కువకులాలవారు సాంఘికంగా, సాంస్కృతికంగా పైకి రావడానికి ప్రయత్నిస్తే, అలాంటి ప్రయత్నాలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తుంటారు...." ఈ అణచివేతలకు కొన్ని ఉదాహరణలను యిచ్చారాయన. ఉదా॥ బ్రాహ్మణుల వేషభాషలను సోనార్ (స్వర్ణకార) కులంవారు అనుకరించరాదంటూ పీష్వాలకాలంలో చేయబడిన శాసనం: 1928లో ఇండోరు ప్రాంతంలో బాలికులస్థులపై విధించబడిన ఆంక్షలు....వగైరా.

ఇతర మతశక్తులు ఈ దేశంలో రాజ్యాధికారాన్ని చెలాయిస్తున్న రోజులలో గూడా హిందూమతం సజీవంగా వుండగలిగినదంటూ హిందూమతాన్ని, హిందూ మత ధర్మాలనూ సమర్థించడానికి పూనుకున్న డా॥ రాధాకృష్ణన్ వంటి వారి నుద్దేశించి డా॥ అంబేద్కరు యిలా చెప్పారు :

"ఒక వ్యక్తిగానీ, సమాజంగానీ బ్రతుకడానికీ, ప్రతిష్టాకరంగా జీవించడానికీ ఎంతో తేడా వున్నది. పోరాటంలో ఎదురు నిలచి పోరాడి, జయించి, జీవించడం ఒక పద్ధతి, పోరాటంలో వెన్నుచూపి, ఓడిపోయి, లొంగిపోయి, బానిసగా బ్రతుకడం మరొక పద్ధతి.... హిందూమతం నిరంతర పరాజయాలమూలంగా ఎంతోకాలంగా కృశించిపోతూ

మనగల్గుతున్నది. ఈ వాస్తవాన్ని గ్రహించగలిగిన వివేకవంతుడైన ప్రతి హిందువుడూ సిగ్గుపడవలసినదే...."

హిందూ సమాజం అంటే....?

అసలు హిందూ సమాజ మనేదే ఒక అభూతకల్పన అని అంబేద్కరు అభిప్రాయం. మహమ్మదీయ దండయాత్రకు పూర్వం రచించబడిన ఏ సంస్కృత గ్రంథంలోనూ "హిందూ" శబ్దం కనుపించదంటూ, డా॥ అంబేద్కరు ఆ శబ్దం సింధునదికి యివతలివైపున గల ప్రాంతంలో వుండే వారిని వర్ణించడానికి వాడబడిన శబ్దమనే అభిప్రాయాన్ని అపరచారు.

"హిందూ సమాజమంటూ ఒకటి లేనేలేదు. ఇది కేవలం కొన్ని కులాల సమూహం మాత్రమే. ఒక కులానికి తక్కిన కులాల బాగోగులతో సంబంధంలేదు", అంటాడు శ్రీ అంబేద్కరు.

సంఘ చైతన్యమనేది హిందువులలో లేనేలేదంటారు డా॥ అంబేద్కరు :

"హిందూ సిద్ధాంతాలను గ్రుడ్డిగ అనుసరించే వ్యక్తి కలుగులోవుంటూ తక్కిన విషయాలతో ఏలాటి సంబం

థమూ లేని ఎలుకలాంటివాడు. అసలు హిందూ చైతన్య మనేదే హుళక్కి. హిందువులలో వున్నదల్లా కులచైతన్యమే. హిందువులు ఒక సమాజంగా గానీ, జాతిగా గానీ పరిగణించడానికి వీలులేని ఒక సమూహంలాగా వున్నారు.... హిందూ గ్రంథాలన్నీ కూడా ఒక కులంయొక్క ఔన్నత్యాన్ని, మరొక కులంయొక్క నీచత్వాన్ని ఏకరువు పెడుతూ వ్రాయబడినవే... కులవ్యవస్థ ప్రభావం వలన కుల తత్వం ప్రజ్వరిల్లి, ఆనాటి ద్వేషభావాలు యీనాటి వారిలో కూడా జీర్ణించుకొనిపోయిన కారణంగానే వీరిలో ఐక్యత సాధ్యంకావడంలేదు."

డా॥ అంబేద్కరు యింకా యిలా వ్రాశారు :

"ఆంగ్లేయుల పూర్వీకులు రోజ్ వర్ణమనీ, క్రాంవెల్ వర్ణమనీ రెండుగా చీలి ఘోరాతి ఘోరంగా చంపుకున్న రోజులున్నాయి, ఒకనాడు. కాని ఈనాడు వారిలో ఆనాటి ద్వేషభావం మచ్చుకైనా లేదు. కాని ఒకనాడు శివాజీ పట్ల బ్రాహ్మణ వర్ణంగారు చూపిన ద్వేష భావానికి యీనాటికీ మహారాష్ట్ర బ్రాహ్మణేతర వర్గాలవారు వారిని క్షమించ లేకపోతున్నారు. ఇందుకు కులవ్యవస్థయే కారణం...."

ఒకవేళ ఒక హిందువు ఆటవిక తెగలవారికి సేవ చేయదలుస్తే, అందుకు హిందూమతం అంగీకరిస్తుందా? దీనికి బాబాసాహెబ్ అంబేద్కరు సమాధానం :

"ఆదిమ జాతులను నాగరిక పరచడమంటే, వారిలో ఒకరుగా కలసి జీవిస్తూ సహజీవనభావం కల్గించాలి. హిందువు కది ఏలా సాధ్యం? హిందువుడు అనుక్షణం ఆలోచించేది తన కులంయొక్క ప్రత్యేకతను కాపాడుకోవడం ఎలాగనే దే. వేదకాలంనుండీ ఆర్యేతరులుగ వున్న యీ ఆదిమజాతులతో పొత్తు పెట్టుకుని తన కులాన్ని భంగపరచుకోవడానికి హిందువు ఏవమూ అంగీకరించడు...."

ఈ ఘోరణి వలనగల ప్రమాదాలను అంబేద్కరు హెచ్చరించారు.

"ఈ తెగలవారిని ఆటవిక దశలోనే వుంచినందువలన తనకేమీ ప్రమాదంలేదని హిందువులు భావించవచ్చును. కాని, వారిని యితర మతాలవారు చేరదీసిన పిదప, హిందూ విరోధుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. ఆ నాడు హిందువులు తమ కులవ్యవస్థకు ధన్యవాదా లర్పించాల్సి వస్తుంది...."

అంబేద్కరు యింకా యిలా అంటారు :

"ఒకవ్యక్తి యొక్క గొప్పతనాన్ని గుర్తించి అతని న్యాయకర్తవ్యాన్ని అనుసరించేటందుకు హిందువు అంగీకరిస్తాడా? లేదు. ప్రతి ఒక్కడూ తనయొక్క కులస్తుని నాయకర్తవ్యాన్నే అనుసరిస్తూ వున్నాడు. మంచిని అంగీకరించేబదులు నీచత్వం వచ్చింది. మహమ్మదీయులలో క్రూరత్వం కను

పించవచ్చును. కాని, హిందువులలో వున్నది నీచత్వం-క్రూరత్వంకంటే నీచత్వమే హీనమైనది."

పదే పదే మనదేశం స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకోవడానికి హిందూమతమూ, కులవ్యవస్థా ఎలా కారణభూతమైనదీ అంబేద్కరు వివరించారు.

"దేశం యావత్తూ ఒక్కటిగా శత్రువు నెదిరించినది లేదు. సమాజంలో ఒక భాగం మాత్రమే ఎదురు నిలిచేది. ఎవరైతే ఆ చిన్న భాగాన్ని లొంగదీసుకునేవాడో, వాడు మొత్తం దేశంమీద విజేత అయ్యేవాడు. హిందువులలో వున్న కులవ్యవస్థ మూలంగానే యిలా జరిగింది. యుద్ధంలో క్షత్రియులంతా హతమార్చబడితే చాతుర్వర్ణ వ్యవస్థ ప్రకారం మరెవ్వరూ సైన్యంలోనికి చేర్చుకోబడరాదు. ఇదీ గత చరిత్ర. ఇలా దేశం ఎన్నోసార్లు దాస్యబద్ధమయింది.... హిందూమతం ఎవ్వరినీ రక్షించజాలదు."

స్థూలంగా యివీ కులవ్యవస్థ, హిందూమతములగురించి డా|| అంబేద్కర్ అభిప్రాయాలు * ఈ అమానుష

---

* ఈ భాగంలో ఉదహరించబడిన అంబేద్కరు వాక్యాలు జాత్‌పాత్ తోడక్ మండలి (1936) అధ్యక్షోపన్యాసం నుండి, మహాత్మాగాంధీకి అంబేద్కరు సమాధానం (కులనిర్మూలన గ్రంథంలో భాగం) నుండి, బౌద్ధమత స్వీకారం సందర్భంగా చేసిన ప్రసంగం నుండీ స్వీకరించబడినవి.

మైన కులవ్యవస్థను కూలద్రోయడమనేది హిందూమతాన్ని అంగీకరించినంతకాలం సాధ్యం కాదని నిర్ణయించుకుని, తన సహచరు లందరిచేతా బాబాసాహెబ్ అని గౌరవించబడిన డా॥ అంబేద్కరు లక్ష్మీలాది సహచరులతో తన చివరి రోజు లలో హిందూమతాన్ని వదిలివేసి 1956లో బౌద్ధమతాన్ని స్వీకరించారు.

ద్వేషమూ _ జాలి

కులవ్యవస్థను ఎదిరించేవారికి ఆ వ్యవస్థకు మూలమైన మతాచారాలపట్ల, వాటిని కాపాడుకుంటూ వస్తున్న అగకులాల పెత్తందారులపట్ల విపరీతమైన జుగుప్స, క్రోధమూ వుండడం సహజమే. అయితే, వాటితోపాటు జాలి, సానుభూతి గూడ కల్గిన దృష్టితో కులనిర్మూలనోద్యమం సాగాలని డాక్టరు లోహియా వంటివారు చెబుతూ వచ్చారు. డా॥ అంబేద్కరుకు వ్రాసిన ఒక లేఖలో డా॥ లోహియా యిలా అన్నారు.

"క్రోధానికి జాలినిగూడా జోడించాలనే నేనిప్పుడు గూడా ఆశిస్తున్నాను. మీరు షెడ్యూల్ కులాలకు మాత్రమే గాక మొత్తం భారత ప్రజలకు నాయకుడు కావా లని నా ఆశ..."

శ్రీ మధులిమాయెకు వ్రాసిన మరొక లేఖలోగూడా

డా।। అంబేడ్కరు మరణం గురించి ప్రస్తావిస్తూ లోహియా యిలా వ్రాశారు.

"డా।। అంబేద్కరు భారత రాజకీయాలలో ఒక గొప్ప వ్యక్తి. గాంధీజీని వదిలేస్తే మొత్తం సవర్ణ హిందువులలోని అతి గొప్ప వ్యక్తుల కెవ్వరికీ తీసిపోనంతటి గొప్ప వ్యక్తి. ఈ సత్యం నాకు ఈ కులవ్యవస్థను నిర్మూలించడం సాధ్యమేనన్న ఆశను కలిగిస్తున్నది... డా।। అంబేద్కరు, జగ్‌జీవన్‌రాంలు ఆధునిక హరిజనులలో రెండురకాల వారికి ప్రతినిధులు. డా।। అంబేద్కరు విద్యాధికుడు. నిజాయితీ పరుడు, ధైర్యశాలి, స్వతంత్రుడు. జాగృత భారతావనికి ప్రతినిధిగా ప్రపంచానికి చూపబడదగిన వ్యక్తి. కాని ఆయనలో ద్వేషమూ, వేర్పాటు తత్వమూ చోటుచేసుకున్నాయి. హరిజనేశ్వరులకు నాయకుడు కావడాని కాయన సిద్ధం కాలేదు. ఐదువేల సంవత్సరాల బాధ నేటికీ హరిజనులపై ఎంత ప్రభావం కలిగివున్నదో నేను అర్థం చేసుకోగలను. అసలు విషయం అదే. అంబేద్కరులాంటి మహా వ్యక్తి ఏదో ఒకనాడు తప్పక ఈ పరిస్థితినుండి పైకి లేస్తాడనే విశ్వాసం నాకుండినది. కాని ఆయన చాలా త్వరగా మరణించాడు... జగ్‌జీవన్‌రాం పైకి సవర్ణ హిందువులతో మంచి సంబంధాలు కల్గివుంటాడు. వారిని పొగుడుతూ, మెప్పిస్తూ గూడా వుంటాడు. కాని విడిగా హరిజనుల మధ్య వున్నప్పుడు మాత్రం సవర్ణులపట్ల ద్వేషాన్ని ప్రదర్శిస్తుంటా

డని విన్నాను. ఇది భారతజాతి అభ్యున్నతికిగానీ, హరిజనుల వుద్ధరణకు గానీ మార్గం కానేకాదు. అయితే, అంబేద్కరు తరహా వారిలోగూడా మరికొంత మార్పు అవసరం."

హరిజనుడుగా జన్మించి, బాల్యంనుండీ కులవ్యవస్థ వలన ఘోరమైన బాధలను స్వయంగా అనుభవించిన వ్యక్తిలో క్రోధం, బాధ ఎక్కువై జాలి అనేది కొంత పోవడం సహజమే. అయినా ద్వేషమనేదే పూర్తిగా మనస్సును ఆక్రమిస్తే మాత్రం దానివలన ఆశించిన ఫలితాలు రావు.

కులవ్యవస్థపై తిరుగుబాటు చేసేవారు తాము ఒక అగ్రవర్ణం మీదనో, ఆ కులానికి చెందిన వ్యక్తులమీదనో తిరుగుబాటు చేస్తున్నామనే భావన రానీయగూడదు. తాము పోరాడుతున్నది ఒక వ్యవస్థమీదననే విషయాన్ని వారెన్నడూ విస్మరించరాదు. తిరుగుబాటు చేసే బడుగు కులాలవారు ఆ వుద్యమాన్ని తమ కులంయొక్క వుద్ధరణ కొరకే నిర్వహిస్తున్నామనే అభిప్రాయాన్ని గూడా రానీయ గూడదు. ఈ పోరబాట్లు గతంలో జరిగాయి. ఉదా॥ బ్రాహ్మణేతర వుద్యమాలు నిర్వహించినవారు తాము బ్రాహ్మణులకు వ్యతిరేకంగా పోరాడుతున్నామనే తప్పు అవగాహనతో వ్యవహరించారు. అందువల్లనే బ్రాహ్మణుల ప్రభావాన్ని తగ్గించిన నాటికి బ్రహ్మణే తరులలోని సంపన్న

కులాలవారు తాము బ్రాహ్మణుల స్థానాలను ఆక్రమించుకున్నారుగాని, తాము బ్రాహ్మణులనుండి పొందిన అధికారాలను ఇతర బడుగు కులాలవారితో కలసి పంచుకునేందుకు నిరాకరించారు. దీనివలన కులవ్యవస్థ అంతంకాదని గుర్తించాలి.

ఒక కులాన్ని అధికారంనుండి తొలగించి, మరొక కులాన్ని ఆ స్థానంలోని క్రిందించడం వలనగానీ అధికారం లోల్పోయిన కులంపట్ల పగతో వ్యవహరించి, ఆ కులాన్ని పూర్తిగా త్రొక్కివేయడం వలనగానీ కులవ్యవస్థ అంతం కాదు. అది సామాజిక చక్రభ్రమణానికి మాత్రమే దారి తీస్తుంది. దానివలన సమాజ చక్రంలో ఎప్పుడూ ఏదో ఒక కులంపైన, మరొక కులం క్రిందావుండే విధానంమాత్రం కొనసాగుతూనే వుంటుంది. కులాలమధ్య హెచ్చుతగ్గులనేవి పోవాలంటే కులాలనేవే లేకుండా పోవాల్సి వుంటుందనే అవగాహన లేనంతకాలం సమస్య పరిష్కారంకాదు. అంత వరకూ భారతీయసమాజం శక్తివంతం కాజాలదు. ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తించిన వారిలో ముఖ్యుడు డా!! లోహియా.

ద్రవిడక జగం నాయకుడు శ్రీ రామస్వామి నాయకర్‌ను జైలులో కలుసుకొని సంభాషించిన అనంతరం లోహియా చెప్పిన మాటలివి:

"నేను కులాలను నిర్మూలించడానికి పూర్తిగా అను కూలుడినని ఆయనతో చెప్పాను... ఆయనతో కలసి ఆ సమస్యపై శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన గలనని గూడా చెప్పాను... కాని ఆ వ్యక్తులమీద హింసకు పూను గోవడాన్ని నేనుఖచ్చితంగా ఖండిస్తున్నాను. అది మానవీయ హక్కులకు భంగం కలిగిస్తుంది.... తనయొక్క బాధ దేశ విచ్ఛిత్తికి దారితీయరాదని నేను ఆయనను గోరాను...."

అగ్ర కులాలవారిలో గూడా కులవ్యవస్థా నిర్మూల నను గోరేవారు అనేకమంది వున్నారనే వాస్తవాన్ని గుర్తిం చాలని డా॥ లోహియా గోరారు. కులనిర్మూలన అనేది కొన్ని దళితకులాల సమస్య మాత్రమే ననుగోవడం పొర బాటు. సమాజంలో ఒక కులం బలంగావుండి. మిగతా కులాలు చదువు, అధికారమూ, సంపదా లేక నిస్తేజంగా వుండడమంటే మొత్తం సమాజం నిస్తేజంగా వున్నట్లే. ఒక చెయ్యిమాత్రం పనిచేసి మరొకచెయ్యి కుంటిదై పోయిన మనిషి ఎలాగో ఒకకులం బలంగానూ, మరొక కులం ఏ అవ కాశాలూ లేకుండానూ వుండే సమాజం గూడా అంతే. అందువలన కులవ్యవస్థా నిర్మూలన మనేది మొత్తం సమాజంయొక్క సమస్య. అందుకో అగ్రకులాలకు చెందిన వ్యక్తులకు గూడా శ్రద్ధ వుండడం అవసరం.

అగ్రకులాలవారి కర్తవ్యం

సాంప్రదాయ బ్రాహ్మణ తత్వానికి, అగ్రజాతుల

దురహంకారానికీ వశిష్టుడినీ— ఉదారవాదానికీ, మార్పునూ కోరే అగ్రజాతి వ్యక్తులకూ వాల్మీకినీ ప్రతినిధులుగా పేరొకొంటూ వుండేవాడు, డా॥ లోహియా.

"స్వార్థంతోనూ, ముఠా తత్వంతోనూ నిండివున్న మెదడు వశిష్ట సాంప్రదాయానికి చెందిన బ్రాహ్మణులది. అది చంపడానికీ, తప్పనిసరైతే సాంప్రదాయాలకోసం చనిపోవడానికీ సిద్ధపడుతుంది. ఒకవైపున ఆ మనస్సు తన ముఠా కోసం దేనినైనా విసర్జించడానికి సిద్ధపడుతూనే మరొకవైపున తన యొక్క భౌతిక భాగాల కోరకుగూడా తహ తహ లాడుతూ వుంటుంది. వారి సాంప్రదాయాలు దేశీయమైనవే కావాల్సిన పనిలేదు, తమకు కావలసిన వాటిని అన్యదేశాలనుండీ, జాతులనుండీ స్వీకరిస్తారు.... ఈ పరంపరకు చెందిన వాడు పాములాగా చుట్టుకునివుండి కాటువేసే అవకాశం కోసం మాత్రం సిద్ధంగా వుంటాడు....

"నేను అందరు బ్రాహ్మణుల గురించీ, వైశ్యుల గురించీ యీ మాటలు వాడడంలేదు. * రాజ్‌నారాయణ్, మధులిమాయే, బాలేశ్వరదయాళ్‌లు గూడా బ్రాహ్మణ కుటుంబాలకు చెందినవారే. కాని, వారికంటే మించినారు,

---

* రాజ్‌నారాయణ్, మధులిమాయె, బాలేశ్వర దయాళ్ : సోషలిస్టు నాయకులు.

వ్యుత్తములు, భారతదేశంలోని ఏ రాజకీయ పార్టీలోనైనా దొరకడం కష్టం. వారిని బ్రాహ్మణులని నేను అనడంగూడా వారికి ఇష్టంగా వుండకపోవచ్చును. ఎందువల్లనంటే, వాల్మీకి పరంపరకు చెందిన వారికి యిప్పుడు నడుస్తున్న చరిత్రకుల వ్యవస్థయొక్క అంతిమ దశయనే భావన వున్నది....

"....మాతృ హంత పరశురాముని మొదలు జాతి హంత నెహ్రూవరకూ యిది విశిష్టపరంపర. విశ్వామిత్రుడు మొదలు విశ్వేశ్వరయ్య♦♦ వరకూనేమో వాల్మీకి పరంపరకు చెందినవారు..."

కాశీలో జరిగిన ఒక సంఘటనను డా. లోహియా తరచు ప్రస్తావిసూ వుండేవారు. దానిని గురించి ఒకచోట ఆయన యిలా వ్రాశారు:

"భారత రిపబ్లిక్ అధ్యక్షుడు (రాజెన్ బాబు) బహిరంగంగా వారణాసి నగరంలో 200 బ్రాహ్మణుల కాళ్ళు కడిగాడు. ఇది కులవ్యవస్థకూ, మతిభ్రమణానికీ బలం చేకూర్చేపని. ఈ హేయమైన పనికి రాష్ట్రపతే పూనుకోవడం మహానేరం....ఈ కథ పూర్తి వివరం నాకొక బ్రాహ్మ

♦♦ విశ్వేశ్వరయ్య: మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు సుప్రసిద్ధుడైన ఇంజనీరు. స్త్రీలగురించీ, కులాలగురించీ ఆయన అనుసరించిన వైఖరిని లోహియా ఎంతో ప్రస్తుతించేవాడు.

ఋని వద్ద లభించింది. అతనూ ఆ రెండువందల మందిలో వున్నాడు కాని తీరా కాళ్ళు కడిగించుకో బోయేముందు రాష్ట్రపతిచేత కాళ్ళు కడిగించుకోవడమనే పాపానికి పాల్ప డకముందే, ఖంగారుపడి తప్పుకున్నాడు ఆ స్థానాన్ని మరొక బ్రాహ్మణుడు వెంటనే పూరించాడు. ఆ దయ్యాల ఆటలో వున్న ఒకేఒక మానవుడైన ఆబ్రాహ్మణ అధ్యాపకు డిని నేనెన్నడూ మరువజాలను. బ్రాహ్మణులుగా జన్మించిన యిలాంటి కొద్దిమంది స్త్రీ, పురుషులే దక్షిణాదిన బ్రేళ్ళ నిన బ్రాహ్మణేతరోద్యమపు చాందస థోరణుల వలన దేశం చీలిపోకుండా నిలుపగలుగుతున్నారు."

డా. లోహియా యింకా యిలా బ్రాశారు: "కుల వ్యవస్థ, ఆర్థిక అసమానతలూ గత 1500ఏండ్లుగా దేశాన్ని విప్లవానికి అసమర్థం చేశాయేమోననే భయం లేకపోలేదు. భారత ప్రజలు ఎన్నడూ ఏనియంతకు వ్యతిరేకంగానూ తిరుగుబాటు చేసియుండలేదు. సమానత్వంవున్నా, పూర్తి వ్యత్యాసాలు వున్నాకూడా తిరుగుబాటు సాధ్యంకాదు—

"90 శాతంగా వున్న బడుగువర్గాలు, 9 శాతంగా వున్న అగ్రకులాల పేదలూ కలసి ఈ వలయాన్ని ఛేదించ వచ్చును. కాని—అగ్రకులాల పేదలు—పెద్దవారి సేవకు లుగా మారుతూవుంటారు— ద్వేషం, పగలతో రెచ్చ

గొడిలేగాని బడుగుకులాలవారేమో నిద్రలేవడంలేదు. ద్వేషం, పగ ఒక వ్యక్తినిగానీ వర్గాన్నిగానీ ఆవరించివున్నప్పుడు ఆ వ్యక్తిగానీ, వర్గంగానీ తనలోని శక్తిని పెలయించ జాలదు—బడుగుకులాలనుండి నాయకులను పైకి తేవడంలో పెద్దకులాలవారు మాతృప్రేమతో వ్యవహరించాలి—"

అగ్రకులాలకు చెందినవారు తాము నాయకత్వ స్థానాలకొరకు తహతహలాడడం మానివేయాలి. బడుగు కులాల వారినే నాయకత్వ స్థానాలలోనికి ప్రోత్సాహిస్తూ ఎదుగువలె తాము వుపయోగపడడం నేర్చుకోవాలి.

వేల సంవత్సరాల చరిత్రలో కొన్ని కులాలు స్వార్థంతో మిగతా కులాలను సంపూర్తిగా అణచివేసి విద్యనూ, ధనాన్నీ, అధికారాన్ని కూడా తమ హస్తగతం చేసుకున్న విషయాన్ని అగ్రకులాలకు చెందిన యువకులు గుర్తించాలి. ఈ విధానంవలన సమాజం పరస్పర ద్వేషం, ఈర్ష్య, అసూయ, పగలతో నిండిన వంశపారంపర్య ముఠాలుగా చీలిపోయి సమైక్యత వీలుపడని స్థితికి చేరుతుందని అర్థం చేసుకోవాలి. ఈ మొత్తం పరిస్థితిని సానుభూతితో, ప్రశాంతంగా అవగాహన చేసుకుని తమ త్యాగాలద్వారా ప్రేమద్వారా అణచివేయబడిన వర్గాలవారి విముక్తికి సమాజ సమిష్టి ప్రయోజనాలదృష్ట్యా కృషిచేయడం అగ్రకులాలలోని యువజనుల చారిత్రక కర్తవ్యం.

దోపిడీదారు లెవరు ?

సమాజంలో దోపిడీదారులెవరో, కానివారెవరో సరిగా గుర్తించబడినప్పుడు బడుగుకులాల వారుగానీ, అగ్రకులాల పేదలుగానీ సమస్యను కొంతవరకు స్పష్టంగా అవగాహన చేసుకోగల్గుతారు. దోపిడీదారులను గుర్తించడానికి, డా. లోహియా ఈ విధంగా ప్రయత్నించారు.

"వాస్తవానికి నాము అగ్రకులాలకు చెందినవారిలో బహుళ సంఖ్యాకులు తక్కువ కులాలవారి స్థాయిలోనే వున్నారు. అయితే వారు ఈ వాస్తవాన్ని గుర్తించలేనంతటి అజ్ఞానస్థితిలోనే వున్నారు..."

"బంగాలీజిడ్డీలు, మార్వాడీబనియాలు, కాశ్మీర బ్రాహ్మణులూ ... యిలాంటి కొన్ని శాఖలవారే వ్యాపార వుద్యోగ వర్గాలలోని నాయకత్వ స్థానాలను తమ ఆధీనంలో నిల్పుకున్నారు.... భారతదేశంలోని పాలకవర్గాలను మూడువిషయాలలో మిగతా ప్రజలనుండి వేరు చేసను వచ్చును. 1. అగ్రకులం 2. ఆంగ్లవిద్య 3. సంపద. ఈనాడు ఈ మూడింటిలో ఏ రెండుగానీ ఒక వ్యక్తిలో వుంటే అతను పాలకవర్గంలో సభ్యుడుగా పరిగణించ బడవచ్చును. ఈ పాలకవర్గంలో నూరింట 90 మంది అగ్రకులాలేవారే. వారికి ఆంగ్లమో, ధనమో తోడవుతుంది. విద్య, ధనమూ చలనము (Mobility) గల అంశాలని కొంతను భావించ

వచ్చును. కాని, కులం అనే మూడవ అంశం ఎప్పుడైతే వున్నదో, అప్పుడే ఎదుగు బొదుగులు సాధ్యపడని పరిస్థితి తయారయింది....ఆ పాలకవర్గంలో ఎందరున్నారు:...

"...వారి సంఖ్య 40 లక్షలుంటుంది... ఈ 40 లక్షల మందీ 40 కోట్ల మందిని స్వార్థంతో పరిపాలిస్తున్నారు..."

"మరో ప్రమాదం ఏర్పడింది. ప్రతి పంచవర్ష ప్రణాళికలోనూ 50 లక్షలమంది క్రొత్తగా పాలకవర్గంలోనికి చేరడానికి వీలుపడుతున్నది. వీరిలో80శాతం పెద్దకులాలవారే.... ఇది ప్రగతిపట్ల భ్రమలు కల్గిస్తోంది. వెనుకబడిన కులాలనుండి కూడా కొద్దిమంది వ్యక్తులను, లేదా ముఠాలను పాలకవర్గంలోనికే చేరేటట్లు చూడడం జరుగుతుంది....ఈ బాపతువారు అగ్రకులలవారిని మించిన లుబ్ధత ప్రదర్శిస్తున్నారు....

"....అగ్రకులాల పురుషులలో 5 కోట్ల మంది పేదలు. 40 లక్షల మందేమో ధనికులు. మిగతా 40 కోట్లమంది— అన్ని కులాలలోని స్త్రీలతోసహా — బడుగు కులాలవారే...."

'ధనికు'లంటే ఏమిటోగూడా చాలా స్పష్టంగా వివరించాడు, లోహియా:

"ధనికులు అంచే నెలకు వెయ్యిరూపాయలకు మించిన ఆదాయంగల వారన్నమాట.... మోటారు కార్లు, టెలిఫోనులూ, ఆదాయపు పన్ను లెక్కలూ వగైరాలను ఆధారం చేసుకుని వేసిన అంచనా లివి...."

(రూపాయి విలువలో మార్పిడి వచ్చిన దృష్ట్యా యిక్కడ వెయ్యి రూపాయలను తరువాతి కాలంలో పది హేను వందలుగా లోహియాయే మార్పుచేయిడం జరిగింది.)

ఇదీ దేశాన్ని దోపిడీ చేస్తున్న పాలకవర్గం యొక్క స్వరూపం. ఇంగ్లీషును గురించి మాట్లాడేటప్పుడు భాష ఈ స్థానాన్ని పొందడానికి పూర్వం సంస్కృతము, పర్షియన్ భాషలు ఆ స్థానంలో వుండేవని మరచిపోరాదు. ఎప్పుడూ కూడా ప్రజల భాషకూ, పాలకుల భాషకూ మధ్య వ్యత్యాసాన్ని పాలకవర్గాలనారు అట్టిపెడుతూ వచ్చారన్నది యిక్కడ ముఖ్యాంశం. పురాతనకాలంలోగూడా సామాన్య ప్రజలు మాట్లాడని భాష సంస్కృతం, కాని, విద్యా వ్యాసంగమూ, శాస్త్రచర్చ, పరిపాలన— అంతా సంస్కృతంలో వుండేది. అలాగే తరువాతికాలంలో పర్షియన్. ఆ రెండింటికీ వారసత్వంగా వచ్చినది ఆంగ్లము. ఇవి మాడూ విజ్ఞానాన్ని, పరిపాలనా వ్యవహారాలనూ ప్రజలవద్దకు వెళ్ళకుండా అడ్డునిలచే "రహస్య, సంకేత" భాషల వంటివే.

దోపిడీదారులను గుర్తించేటప్పుడు దృష్టిలో వుంచుకోదగిన మరికొన్ని విషయాలను గూడా డా।। లోహియా తీవ్రంగా చర్చించారు:

"ఆంధ్రా రెడ్లూ, తమిళ మొదలియార్లూ, కేరళ నాయర్లూ జంధ్యం విషయంలో తప్ప మిగతా విషయాలలో వెనుకబడినవారు కాదు. వారు ఉత్తర భారతదేశపు క్షత్రియ - వైశ్య కులాలతో సమానం. మహారాష్ట్రలోని మరాఠాలూ, కర్నాటకలోని లింగాయత- వక్కలిగలూ గూడా దాదాపు అంతే.... 50 ఏండ్లుగా ద్విజేతరులకు విశిష్టావకాశాలు కావాలంటూ తాము జరిపిన పోరాటాలను వీరు విస్మరించారు... ఈ వర్గాలు యిప్పటికే ద్విజులకు సన్నిహిత మైనాయి...."

"....అగ్రకులాలలో మరొక ప్రత్యేక లక్షణమున్నది. వీరిలో కొన్ని కులాలవారు సాంప్రదాయకంగా వుద్యోగులు, కొందరు వ్యాపారులు. ఈ భిన్నత్వం వర్గ సంఘర్షణకు సంబంధించిన వైరుధ్యంగా భ్రమలు కల్గిస్తూ, అర్థరహితమైన శుష్క వివాదాలకు దారితీస్తూ వుంటుంది. పైవేటు రంగం, పబ్లికు రంగముల మధ్య వుండే పై పై వైరుధ్యాలను నిజమని భ్రమించుట ప్రజల తెలివితక్కువను మాత్రమే రుజువు చేస్తుంది...."

ఈ వాస్తవాన్ని గ్రహించలేక, అగ్రవర్ణాలకు చెందిన దోపిడి వర్గాలమధ్య అప్పుడప్పుడూ సాగే నకిలీ

కుల వ్యవస్థను నిజమైన వర్గ సంఘర్షణగా భ్రమించడం జరగ వచ్చునని డా॥ లోహియా చాల స్పష్టంగా హెచ్చరించారు. సాంఘిక సమానత్వం కోసం పోరాడేవారు అసలు దోపిడీ దారు లెవరో ముందుగా గుర్తించడం అవసరం.

కులవ్యవస్థ ఫలితాలు

కులవ్యవస్థను నిర్మూలించ దలచుకున్నవారు తాము సామాన్యమయిన పనికి పూనుకొన్నామనుకొనరాదు. వేలాది సంవత్సరాలుగా బలంగా వ్రేళ్ళూని నిలచిన ఈవ్యవస్థను నిర్మూలించడం తేలికయిన పనికాదు. ఆ పనిని సాధించడానికి స్పష్టమయిన అవగాహన, దృఢమయిన దీక్ష త్యాగనిరతి అవసరం.

కులవ్యవస్థయొక్క దుష్ట ఫలితాలను డా॥ లోహియా యిలా సమీక్షించారు.

"జీవిత విలువలన్నీ తారుమారై పోయాయి. ఉన్నతకులాలవారు సంస్కారంవున్న కుతంత్ర పరులుగానూ బడుగుకులాలవారేమో మార్పు నెరుగని జీవచ్ఛవాలుగానూ తయారయినారు. దేశంలో మేధావులను గుర్తించడానికి కొలతబద్దగా విజ్ఞాన సంపదను తీసుకోవడానికి బదులు, మాటలలోని సొంపులు, సొగసులూ మాత్రమే తీసుకోవడం జరుగుతుంది. ...

...'దానం చెయ్యడం ద్వారా పరలోకప్రాప్తి పొందవచ్చుననే భావన కొన్నిరకాల యాచనకు బొస్న త్యాన్ని కలుగజేసింది'...

నిర్మొహామాటం, నిర్భయం అనే సుగుణాలకంటే చాకచక్యం, బహిరంగ నిధేయతా. చాటుమాటు వ్యవహారాలూ అనేవి బొస్న త్యానికి చిహ్నాలుగా తయారయినాయి. రాజకీయజీవితంలో బొంకులకు గొప్ప గౌరవస్థానం లభించింది. సంకుచితత్వం, స్వార్థపరత, బొంకు — యీ దుర్గుణాలకు గొప్ప ధనంగానూ, మాస్పును ప్రతిఘటించే గొప్ప శక్తిగానూ కులవ్యవస్థ తయారయింది. భారత పౌరులు తమ స్వదేశంలోనే పరాయివారుగా చూడబడుతున్నారు. వారి భాషలు అణచివేయబడ్డాయి ... "

కులాలు వర్గాలుగానూ వర్గాలు కులాలు గానూ పరిణామం చెందడమనే విషయం ప్రస్తావిస్తూ 'వర్గ సంబంధాలలో కదలిక లేని తనం (immobility) రాగానే వర్గాలు కులాలవుతాయి. కులాలలో కదలికవస్తే (mobility) అవి వర్గాలుగా మారతాయి. .... ప్రతినాగరికత కూడా కులాలు వర్గాలు, వర్గాలు కులాలుగా మార్పుచెందే యీదశలను అనుభవించే వున్నది" అంటారు డా|| లోహియా.

హిందూమతంయొక్క ఆత్మవంచనా స్వభావాన్ని ద్వంద మనస్తత్వాన్ని వివరిస్తూ డా|| లోహియా:

"సంపాదనా కాంక్షను నిరుత్సాహ పరుస్తూ నిష్క్రియ యోగాన్ని బలపరుస్తూంది, హిందూమతం. కాని, ఆదేసమయంలో దాని కర్మ సిద్ధాంతం అస్పృశ్యులనూ, అధికార వంశాలవారినీ సమాజంలో వున్నతులుగా తయారు చేసి పెట్టింది ....

.... హిందువు యితరులను వంచించడమేగాక, తనను తానే దారుణంగా వంచించుకుంటున్నాడు. బహుశః అనుభవంలో వున్నదానికీ, సత్యానికీ మధ్యగల ద్వైదీభావం అతని చేత యిలా చేయిస్తున్నదేమో! .... ఆధ్యాత్మిక సమాంతర్వం, సాంఘిక అసమానత ఒకదాని సరసన ఒక వుంటున్నవి .... సహనం గురించి హిందూమతం ఎంతగా చెప్పినా, హిందువులలో ఒకరు మిగతావారిని అణచిపెట్టి, లోబరచుకోవడానికే చూస్తూ వచ్చారు .... 4 వేల సంవత్సరాల క్రితం ఒక హిందువు మరొక హిందువు నాలుక పీకివేశాడు .... మూడువందల ఏండ్లనాడు తన వంశస్తులకు మంత్రులుగా బ్రాహ్మణులే వుండాలని ఒప్పందం చేసుకుని గానీ శివాజీ రాజు కాలేకపోయాడు .... చివరి పానిపట్టు యుద్ధంలో పెద్దకులానికి చెందిన ఒక సేనాని తన గుడారం చిన్న కులానికి చెందిన సేనాని గుడారం కంటె ఎత్తుమీదనే వుండి తీరాలని పోట్లాడి విదేశీయుల విజయానికి కారకుడయినాడు .... ఇటీవలనే హిందూ ధర్మ రక్షణ పేరిట గాంధీజీపై బాంబు ప్రేల్చాడొకడు .... హిందువుడయిన మంగలి హిందువుకానట్టి వానికి క్షౌరం చేస్తాడుగాని, తక్కువ కులం వాడయిన హిందువుకు మాత్రం చేయడు ..."

హిందూమతమూ, కులవ్యవస్థా సాధించినదిదే. కుల వ్యవస్థను హిందూమతానికే అంటగట్టవద్దనీ, రెంటికి సంబంధం లేదనీ వాదించేవారు లేకపోలేదు. అందుకే హిందూమతం అంటే ఏమిటో ఒకచోట వివరించాడు డా॥ లోహియా :

"హిందూమతం అంటే ఏమిటి? దీనికి ఏఒక్క సమాధానము సరయినదికాదు .... కొల్లలు కొల్లలుగా విన్న పురాణాలు, శాస్త్రాలు, జ్ఞాపకాల దొంతరలూ, తత్వశాస్త్రాలూ, ఆచారాలూ, సాంప్రదాయాలూ — ఇందులో కొన్ని అమానుషమయినవీ, కొన్ని సేవాదృష్టిగలవీ — అన్నీ కలిసి వెరసి హిందూమతం అవుతుంది."

ఆధునిక నాగరిత అనబడే పారిశ్రామిక నాగరికత బలపడుతూన్న యీనాడు గూడా సమాజంలోని వివిధ వర్గాలపై కులవ్యవస్థ ప్రభావం ఎంతతీవ్రంగా వున్నదో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

నేటి మేధావి వర్గంపైన కులవ్యవస్థ ప్రభావం చూడండి. ముఖ్యంగా సృజనాత్మకమయిన రచనలు చేసే వారిపైన — ఉదా॥ నవలారచయితలు, కథలు వగైరా ॥ — దీనిప్రభావం ఎలా వుంటుంది? ఒకరచయిత గొప్పవాడు కావాలంటే అతడు సమాజం నుండి, జీవితంనుండి అనుభూతి పొందాలి. ఆ పిదప దానికి సరియైన వ్యక్తీకరణ

యివ్వాలి. అందుకతడు గొప్ప మానవతా వాదియై వుండాలి. కాని మనదేశపు పరిస్థితులు అతడిని కులతత్వ వాదిగానే తయారుచేస్తున్నాయి. పుట్టుకతో తానేకులంలో సభ్యుడయినాడో ఆకులంయొక్క అనుభూతీ, సంస్కారము మాత్రమే అతడిని ప్రభావితుడుని చేస్తున్నాయి. ఉదాహరణకు ఒకబస్సు బోల్తాపడిన వార్త పత్రికలో వచ్చిందను కోండి. ఆవార్త చదువుతున్న వ్యక్తి ఏకులస్తుడో, ఆ కులానికే చెందిన మరొకడు ఆ ప్రమాదంలో మరణించి నట్లు ఆవార్తలో వుంటే విచారం మరికాస్త ఎక్కువవు తుంది. ఇతరుల బాధను పంచుకోవడమనేది సర్వమానవ సమానత్వమనే మూలతంపైనగాక, కులవ్యవస్థద్వారా జరుగు తున్నది.

దాదాపు ప్రతి రచయితా కూడా సమాజంలోని ఏదోఒక్క కులంయొక్క అనుభూతిని మాత్రమే వ్యక్తం చేయగల్గుతున్నాడు గాని మొత్తం సమాజంయొక్క అనుభూతిని వ్యక్తం చేయలేకపోతున్నాడు. ఈవిధంగా సృజనాత్మకమైన రచనలను కూడా కులవ్యవస్థ గిరిగీచి నిలవేస్తున్నది.

వాస్తవ పరిస్థితులమీద భావనల ప్రభావం చాలా వుంటుంది. హరిజనులున్నారీ దేశంలో. వారు వేలాది సంవత్సరాలుగా ఒకవిధమయిన బానిసత్వానికి ప్రతినిధులయినారు. కాని, వారి మేధస్సు ఎలా తయారుచేయబడిం

దంటే — ఈ భానిసత్వం చాలా న్యాయమైనదనీ, సహజమైనదనీ వారు భావిస్తుంటారు. వారి భావనలను ఇన్ని యుగాలనుండి అలా రూపొందించింది, భారతీయ మేధావి వర్గం. ఏ యితర దేశమందలి పాలకవర్గమూ యింతఘనమైన విజయాన్ని సాధించలేదు. ఒక బ్రాహ్మణుడు ఒక హరిజనుని యింటికివెళ్ళి అతనిచేతి భోజనం చేయడానికి సిద్ధపడినా కూడా, బ్రాహ్మణుడు తన చేతి భోజనం తింటే తనకే కీడు కల్గుతుందని భావించి భోజనం పెట్టడానికి నిరాకరించే గ్రామాలనేకం యింకా వున్నాయి మనదేశంలో. ఇదీ మౌఢ్యంయొక్క పరాకాష్ట. కాని, యిది భారతీయులకు చాలా మామూలు విషయం. కులవ్యవస్థ, హిందూమతమూ ప్రసాదించినదీ సంస్కారం.

హిందువుల కొక ప్రశ్న

ప్రపంచ చరిత్రలో అనేక దేశాలలో కులవ్యవస్థను బోలిన వ్యవస్థలు వర్ధిల్లాయి, నశించాయి. వాటి చరిత్ర నుండి మనం గ్రహించవలసిన దేమిటి?

ఆధునిక ఐరోపా 700 ఏండ్లక్రితమే కులవ్యవస్థనుండి బైటపడింది. ప్రపంచ పటంలో ఆ ప్రాంతం శక్తివంతంగా పైకిరావడానికీ, దీనికీ స్పష్టమైన సంబంధంవున్నది. భారత దేశపు చరిత్రకూడా యీ సత్యాన్నే చాటుతుంది. ఛాందస ఘోరణులు బలంగా వున్నపుడెల్ల దేశం ఛిన్నాభిన్నమైపోతూ

వచ్చింది. కాని, సంస్కరణవాదం బలపడినప్పుడల్లా రాజకీ
యైక్యత ఏర్పడుతూ, సాహితీ కళారంగాలలో అభివృద్ధి
సాధించడం కనుపిసుంది.

హిందువులు ఈనా డెదుర్కొంటున్న సమస్యను
గురించి డా|| లోహియా యిలా చెప్పారు :

"ఒక గొప్ప మానసిక విప్లవాన్ని సాధించుకోవ
డమా, లేక పూర్తిగా పతనమైపోవడమా అన్నది హిందు
వులు తేల్చుకోవాల్సిన సమయం వచ్చింది. తనను తాను
ముస్లిముగానూ, క్రైస్తవుడుగానూ గూడా హిందువుడు
భావించుకోగలగాలి. ఇది మత విశ్వాసాలు, ఆచారాలలో
జరగడం గురించికాదు.... నేనే అతడు, అతడే నేను అనే
భావన కల్గడం గురించి, నేనంటున్నది."

ఆ విధమైన ఔదర్యాన్ని, ప్రేమనూ హిందువులూ
అలవరచుకోనంతకాలం భారతజాతికి మోక్షంలేదనేది
నిశ్చయం. ఈ కులవ్యవస్థ మూలంగా ప్రతి వ్యక్తి తానొక
చిన్న వలయంలో భాగంగానే వ్యవహరిస్తున్నాడుగాని ఆ
వలయాన్ని అధిగమించి మొత్తం దేశానికి బాధ్యుడు కాలేక
పోతున్నాడు. "నీ వెవరు?" అనే ప్రశ్నకు భారతదేశీయుడు
ఎవ్వడైనా యిచ్చే మొదటి సమాధానం "నేను ఫలానా కులం
వాడిని" అని. ఈ పరిస్థితి మారనంతకాలం దేశంలో తర
తరాలుగా అణచివేయబడుతూ వుండిన 80, 90 శాతం ప్రజ

లలో వున్న శక్తిని దేశ ప్రయోజనాల కొరకై వినియో గించే అవకాశం వుండదు. అణచివేయ బడుతుండిన కులా లలో జన్మించినవారు తాము కేవలం పల్లకీ మోయడానికే భగవంతునిచే నియోగించబడిన వారమనీ, పల్లకిలో ఎక్కే ప్రభువులు వేరే వుంటారనీ భావిస్తూనే వుంటారు. దేశమనే శరీరంలో కులాలన్నీ వేర్వేరు అంగాలనుకుంటే అందులో కొన్ని అంగాలు మాత్రం సచేతనంగా వుండి, మరికొన్ని అంగాలకు స్పర్శజ్ఞానమే లేకుండాపోతే ఎలా వుంటుందో తేలికగానే వూహించవచ్చును.

శక్తివంతమైన దేశనిర్మాణానికీ, నిజమైన జాతీయ ఐక్యతకూ కులవ్యవస్థ నిర్మూలించబడడం తక్షణావసరం.

హింసామతాన్ని తిరస్కరించడం ద్వారా కులాలను నిర్మూలించ వచ్చుననే వాదన గురించి డా॥ లోహియా యిలా వ్రాశారు :

"ఆ పని చేయవచ్చును. కాని, కష్టమైన పని; అంతే కాదు. పాత దొంగలు చాలా తెలివిగలవాళ్ళు. మత రాహిత్యాన్ని కూడా వీరు ఒక మత శాఖగా మార్చేరనే హామీ ఏముంది?.... సనాతన వాదులు మత రాహిత్యపు వేషాన్నే వేసుకోగలరు కూడాను... హిందువు తన శతాబ్దాల మాలిన్యాన్ని కడిగివేసుకొని మనసును శుభ్రపరచుకోవలె. అనుభవంలోనికి వైచ్చుకోగల వాస్తవాలకూ, శాశ్వత

పత్యేనికీ మధ్య నిజాయితీతో కూడిన— ప్రయోజనాత్మక మైన సంబంధాన్ని నెలకొల్పుకోవాలి. అప్పుడు సనాతన వాదాన్నీ మూఢత్వాన్నీ ఓడించడం సాధ్యం. ఓటమి దగ్గరపడి పప్పుడల్లా సనాతనవాదులు ఉదారవాదపు వేషాన్ని వేసుకోవడం జరిగింది. రాజీ అనేది పాత తప్పిదాలనే తిరిగి చేయిస్తుంది."

అందుపలన వ్యర్థమైన పారలౌకిక చర్చలతోనూ, అధిక సంఖ్యాకులకు అంగీకారయోగ్యం కావాలనే ప్రలోభంతో చేసుకునే రాజీలతోనూ, ఒక కులం బదులుగా వేరొక కులాన్ని పీఠమెక్కించే ప్రయత్నాలలోనూ చిక్కుకోకుండా కులవ్యవస్థ నిర్మూలనకై సమగ్రమైన కృషి అవసరం. ఇప్పుడు హిందువుల ముందున్న ప్రధానమైన ప్రశ్న ఒక్కటే—

మీ ఆలోచనా పద్ధతులనూ, సాంప్రదాయాలనూ వదలుకొని దేశాన్ని శక్తివంతం చేయడానికి తయారు కాగలరా? లేక ఈ కుళ్ళు వ్యవస్థ నిలాగే కొనసాగించే ప్రయత్నంలో దేశాన్ని అంతం చేయదల్చుకున్నారా?

ఆధునీకరణ – కులవ్యవస్థ

ఆర్థిక వ్యవస్థలో ఆధునీకరణ జరిగితే కులవ్యవస్థ దాని అంతట అదే అంతరిస్తుందనే విశ్వాసాన్ని ప్రకటిస్తున్నవారు

వాస్తవిక విషయాలను అర్థంచేసుకోలేక పోతున్నారని అనుకోవలసి వస్తుంది. కేవలం గ్రామీణ పూస్వామ్య ఆర్థిక వ్యవస్థ కొనసాగుతున్నంతకాలమే కులాలు వుంటాయని, దానిస్థానే భారీ పరిశ్రమలూ, ఆధునిక ఆర్థిక వ్యవస్థా విస్తరించిన కొలదీ కులాలు అంతరించి పోతాయని అంచనా కట్టడం పొరపాటు. "నిజానికి నాడు స్వీయకుల సంక్షేమ భావానికి, జాతీయ కులసంక్షేమ భావానికి మధ్య సంగ్రామం చెలరేగుతున్నది. వ్యక్తియొక్క నిత్య జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులనుండి కాపాడే ఏకైక సాధనంగా (లేదా భీమా సంస్థలాగా) వున్నది కులం" అంటాడు లోహియా. ఈ పరిస్థితి మారి కులం బదులుగా సమాజం మొత్తంగా వ్యక్తుల సంక్షేమానికి హామి ఇవ్వాల్సి వుంటుంది. అందుకు రాజకీయ, ఆర్థిక రంగాలలో పెద్ద ఎత్తున విప్లవం సాగాల్సి వున్నది. అలాంటి విప్లవానికి కూడ కులవ్యవస్థ ఆటంకంగానే వుంటుందని తెల్సుకోవాలి. ఎన్నికలు, సమ్మేళనాలు సైతం కులాలచేత ప్రభావితం అవుతున్నాయి. "విప్లవం సాధించబడిన పిదప తాను తక్కినవారితోపాటు సమానంగా చూడబడతానన్న విషయంపై అనుమానం వున్నప్పుడు ఎవ్వరుగాని తాను ఆ విప్లవంలో పాల్గొనటందుకు అంగీకరించడు...." అని బడుగు కులాలవారిలో వున్న అపనమ్మకాన్ని వివరించాడు, డా॥ అంబేద్కర్. కనుక ఆర్థిక విప్లవం, సాంఘిక విప్లవం రెండూ ఒకే సమయంలో సాధించబడాల్సి వున్నది.

ఇటీవలి కాలంలో కులాంతర కార్యకలాపాలు అధికంగా సాగుతున్నాయనే ప్రచారం ఒకటుంది. పాతకాలపు భూస్వామ్య వ్యవస్థనుండి యంత్రయుగం వైపుకు పురోగమిస్తున్న దశలో దానికనుగుణంగా కులాల పట్టింపులు సడలుతున్నాయనడానికి దీనినొక సాక్ష్యంగా చెబుతున్నారు. కాని నిజంగా కులాంతర కార్యకలాపాలు తగినంతగా సాగుతున్నాయా? కాఫీహోటళ్ళు, బస్సు ప్రయాణాలవంటి వాటిలో కులాల పట్టింపులు సడలినమాట నిజమే. అయితే వివాహము, సంతాన ప్రాప్తివంటి వాటిలో కులాల బంధనాలనుండి విముక్తులం కావడం జరుగుతున్నదా? లేదు. అగ్రకులాలకు చెందిన వివిధ శాఖల మధ్య విందులూ, అడపాదడపా వివాహాలూ జరుపుకుంటే— దానివలన అగ్రకులాలకూ, దళిత కులాలకూ మధ్య అగాధాలు తగ్గవని గుర్తించాలి. సమాజంలో యిప్పటికే పై అంచెలలో వుండి, భద్రత సాధించుకున్నవారు మాత్రమే కులాంతర వివాహాలకు అధికంగా సిద్ధపడుతున్నారు. మిగతావారు అందుకు సాహసించలేకపోతున్నారు. సాహసించినవారు తమ తమ కులాలవారి, వంశాలవారి మన్ననలను కోలుపోయి— అదే సమయంలో సమాజంనుండి గాని, ప్రభుత్వం వైపునుండి గానీ ఏమీ భద్రత, హామీలేక నలిగిపోతున్నారు. సాహసించి ముందడుగు వేసినవారు యిలా నలిగిపోవడం కులాల పట్టింపులు సడలడానికే వుదాహరణ కాదుగదా! స్వంత

శక్తితో భద్రత సాధించుకుని, అంతర్వర్ణ వివాహాలు చేసుకున్నవారు తామంతా మరొక కులంగా ఏర్పడకుండా జాగ్రత్త పడాల్సిన అవసరంగూడా వున్నదని విస్మరించరాదు. గతంలో ఎన్నో నూతనమైన కులాలు ఈ విధంగా ఏర్పడబడ్డాయి.

స్వంత భూమిగల వారిమధ్య జరిగే అంతర్వర్ణ వివాహాలను గురించి మరొక అంశంగూడా గమనించాలి. వీరిని ప్రారంభంలో దూరంగా తగిలినవారే తిరిగి తమ తమ కులాలలోనికి అనతికాలంలోనే స్వీకరించడానికి వెనుకాడడం లేదు. ఎందుకంటే, వీరుగూడా సమాజంలోని పైపై అంచెలలోనికి చేరుతున్నారు గనుక. ఈ అంతర్వర్ణ సంబంధాలు ఒక్క తరంతోనే అంతమైపోవడం గూడా తరచుగా జరుగుతుంటుంది.

ఒక కమ్మ యువతిని పెండ్లాడిన రెడ్డి యువకుడు త్వరలోనే తిరిగి రెడ్డి కులంలో మామూలు స్థానాన్ని పొందడం, ఆతని సంతానానికి రెడ్డికులం వారితోనే వివాహాలు జరగడం చూస్తున్నాము. ఈ పద్ధతి వలన కులవ్యవస్థ నశించదు.

ఆధునిక నాగరికతకు నిలయాలైన విశ్వ విద్యాలయాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో, ఫ్యాక్టరీలలో— చివరకు సైనిక శాఖలు గూడా కులతత్వా లెంతబలంగా తమ ప్రభా

వాన్ని చూపుతున్నదీ గమనిస్తే, కేవలం ఆధునిక. యాంత్రిక నాగరికత వలన కులవ్యవస్థ అంతంకాదని స్పష్ట మవుతుంది. ఈనాడు వర్ణాశ్రమ ధర్మాలంటూ ఏమీ లేవు. వృత్తులు జన్మనుబట్టి నిర్ధారణ కావడం తగ్గిపోయింది. బ్రాహ్మణుడు చెప్పులుకుట్టే దుకాణం పెట్టుకుంటున్నాడు. చాలా అరుదుగానే అయినా హరిజనులు ఉపాధ్యాయ వృత్తి లోనికే వెళ్తున్నారు. కాని కులాలు పోలేదు. వృత్తి ధర్మాలను వదలినా కులాలను వదలడంలేదు. సమాజంలో పైనున్నవారు ఈ పరిస్థితినికూడా తమకు అనుకూలంగానే వాడుకుంటున్నారు. తాము మాత్రం ఏది లాభసాటిగా వుంటే అది చేస్తూ, బడుగు కులాల వారిని మాత్రం మార్పుకు దూరంగా వుంచి వేసే ప్రయత్నం చేస్తున్నారు.

క్రొత్తగా వ్యవసాయ వృత్తికి అలవాటి పడిన పేద హరిజనులు పశువుల శవాలను తాము తొలగించడానికి రాక పోతే, పెత్తందారీ కులాలవారు కాల్పులు సాగించిన వుదంతాలు యిటీవలనే మధ్యప్రదేశ్‌లో జరిగాయి ఎన్ని సంఘటన లిలాంటివి జరుగడంలేదు? అంతవరకూ ఎందుకు? ఆధునిక నాగరికతకు బాగా అలవాటుపడిన దనిపించుకుంటున్న తోస్తా తెలుగు ప్రాంతంలో ఒక గ్రామ 'సర్పంచ్'గా ఒక హరిజనుని రాజకీయ ప్రయోజనాలకోసం ఎన్నుకున్నారు. కాని ఆ హరిజనుడే గ్రామ చెరువునుండి పెద్దకులాలవారు

విధించిన నిషేధాన్ని కాదని సీరు తీసుకువెళ్ళబోతే, దారుణంగా హత్యచేయబడినాడు. ఇది 1970 నాటి సంఘటన.

యాంత్రిక నాగరికతలో వృత్తులు జన్మనుబట్టే వుండాలనే కట్టుబాటు లేకపోయినా, వాస్తవానికి యీనాడుగూడా కొన్ని కులాలవారు కొన్ని తరహా వృత్తులకు కట్టుబడివుండిపోతున్నారని మాత్రం విస్మరించరాదు. ఉదాహరణకు హరిజనులు ప్రధానంగా వ్యవసాయ కూలీలుగానే కనుపిస్తారు కమ్మ, రెడ్డి, జాట్, కుర్మి వగైరా కులాలవారు ప్రధానంగా వ్యవసాయ కమతాలుగల వారుగానే కనుపిస్తారు. బ్రాహ్మణులు వుద్యోగస్తులుగానూ, వైశ్యులు వ్యాపారస్తులుగానూ వుంటున్నారు.

ఉన్నత కులాలకు సంబంధించినంతవరకు వృత్తులలో కొంత మార్పిడి రావడం (Mobility) జరిగింది. డా॥ లోహియా చెప్పినట్లు, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కులాల వారనుభవించే కొన్ని సౌకర్యాలను వానినుండి తప్పించి మరాఠా, రెడ్డి మొదలియార్, వగైరా కులాలు సాధించుకోగల్గడంతో సమస్య పరిష్కారం కాదు. పైపెచ్చు యీ విధానం వలన యితర బడుగు కులాలలో విసుగు, చిరాకు అగ్రకులాల వారిలోనేమో కక్ష పెరగడం మాత్రమే జరుగుతుంది. కాని, నిర్వ్యక్తికు మూలమైన కులమనేది మాత్రం దాని అవలక్షణాలతో సహా కొనసాగుతూనే వుంటుంది ..."

రాజకీయాలపై కులాల ప్రభావం

జీవితంలోని ప్రతి రంగంలోనూ యీనాటికీ కులవ్యవస్థ యొక్క ప్రభావం చాలా ప్రస్ఫుటంగా గోచరిస్తున్నది. ఆకాశవాణి ప్రసారాలు వింటున్నా, ఒక నాటకంలో వేషం చూస్తున్నా, ఒక నవల చదువుతున్నా గూడా ఆ మాట వెనుక, ఆ వేషం వెనుక, ఆ రచన వెనుక వున్న వ్యక్తి యొక్క కులాన్ని గుర్తించ గలిగే పరిస్థితి వున్నదా? లేదా? ఈ ఆధునిక నాగరికతలో కులాలు వాటి పాత్రను మాత్రం నిర్వహిస్తూనే వున్నాయి. ఇతర రంగాలతో పాటే రాజకీయ రంగంలో గూడా కులాలు వాటి పాత్రను అవి నిర్వహిస్తూనే వున్నాయి.

జాతీయోద్యమ కాలంలో దేశం మొత్తంమీద ఒకే ఒక్క పెద్ద జాతీయ సంస్థ వుండేది. అది ఒక దేశవ్యాపితమైన కులంయొక్క నాయకత్వాన వుండేది. ఆ సంస్థ జాతీయ కాంగ్రెసు. ఆ కులం బ్రాహ్మణ కులం. కాంగ్రెసు జాతీయ సంస్థ కావడానికి యిదొక్కటే కారణమంటే అది సరైన వ్యాఖ్యానం కాజాలదు. కాని, ఆ సంస్థ జాతీయసంస్థ కావడానికి గల అనేక కారణాలలో ఇది గూడా ఒక కారణమనీ, సాంఘికమైన కారణమనీ అంటే మాత్రం అది వాస్తవం కాగలదు. స్వాతంత్ర్యానంతరం బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కులాల స్థానాన్ని క్రమంగా శూద్రులలోని పైత్తం దారీ కులాలు ఆక్రమించుకోవడం చూశాం. జాతీయో

ద్యమం మేధావి వర్గాల పరిధిని దాటి గ్రామాలకు విస్తరిస్తూ వున్న దశలో కాంగ్రెసు బ్రాహ్మణేతర కులాలను, ప్రధానంగా గ్రామీణ పెత్తందారీ కులాలను, ఆకర్షించవలసి వచ్చింది. అప్పటికే బ్రాహ్మణేతరోద్యమాల ద్వారా పైకి లేస్తున్న ఈ రకం కులాలు వెంటనే కాంగ్రెసు నాయకత్వ స్థానాలలోని కెగబ్రాకడం ప్రారంభించాయి. స్వాంతంత్రోద్యమం పూర్తికావడంతో ఈ దశగూడా పూర్తయింది. బ్రాహ్మణ కులము కేంద్రంలోనూ, ఈ పెత్తందారీ కులాలేమో రాష్ట్రాల స్థాయిలోనూ స్థిరపడ్డాయి.

ఈ వివిధ శూద్రకులాలు కేంద్రంలో మాత్రం తమ ప్రభావాన్ని అంతగా చూపలేకపోయాయి. దానికి ఒక కారణం— యివి ఏవీగూడా దేశవ్యాపిత కులాలు కాకపోవడం. జాట్‌లుగానీ, కుర్మీలుగానీ, రెడ్లుగానీ, కమ్మాలుగానీ— చాలవరకు ఒకదానితో ఒకటి సమాన ధర్మాలు నిర్వర్తించుతూ సమానమైన సామాజిక స్థాయిగల కులాలే. కాని, వారు ఐకతాభావాన్ని కల్గివుండరు. వివాహాది సంబంధాలు ఆయా ప్రాంతాల పరిధులలోనే జరుపుకుంటూ వుంటారు. గ్రామీణ పెత్తందార్లుగా, భూస్వాములుగా వుంటూ వచ్చిన వీరు యిప్పుడిప్పుడే కొన్ని చోట్ల ప్రాంతీయమైన చోటా పెట్టుబడి దారులుగా, కాంట్రాక్టరులుగా మారుతున్నారు. వీరికి ఒక సమిష్టి కేంద్రమంటూ లేదు. అదే సమయంలో ద్విజులు రాష్ట్రాల స్థాయిలో తమ ప్రాధాన్య

తను కొంత కొంతగా పోగొట్టుకుంటూ వచ్చినా, కేంద్రంలో మాత్రం తమ ప్రాధాన్యతను నిలబెట్టుకుంటూనే వచ్చారు.

దక్షిణ భారతంలో ద్విజుల జనాభా 2.6 శాతం కు మించదు. ఉత్తర భారతంలో 10 శాతం, తూర్పు భారతంలో 5 శాతం, పశ్చిమోత్తర సీమలలో 4½ శాతం వుంటుంది, వీరి జనాభా. అంతేకాదు— ద్విజుల జనసంఖ్య పట్టణ ప్రాంతాలలో సగటున 17.4 శాతం వుంటుంది. గ్రామాలలో వీరి సంఖ్య నామమాత్రమే. అందువలన ఆయా ప్రాంతాలలో— ముఖ్యంగా పల్లెసీమలలో తాము ఆధారపడదగిన మరికొన్ని కులాలతో నేస్తం కట్టిగాని ఈ ద్విజులు పెత్తందారీ కులాలతో సంఘర్షణకు పూనుకోరు.

(ఈ సంఖ్యా వివరాలు '51-'54 నేషనల్ శాంపుల్ సర్వే అంచనాల లోనివి)

బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కులాలవారికి (ద్విజులకు), 'చౌధురీ' లని పిలవబడే గ్రామీణ పెత్తందారీ కులాలవారికి మధ్యగల వైరుధ్యం రాజకీయాలలో కేంద్ర-రాష్ట్ర సంఘర్షణ రూపాన్ని తీసుకోవడం తప్పనిసరి. కాని తమకు నమ్మకమైన, ఆధారపడదగిన నేస్తం లభించేవరకూ ద్విజులు సంఘర్షణను తీవ్రతరం చేయరు. అందువల్లనే

కేంద్ర–రాష్ట్ర సంఘర్షణ యింకా తీవ్ర రూపాన్ని తీసుకో లేదు. ఈ పరిస్థితివల్ల కొన్ని కులాల బలం ఆధారంగా ప్రాంతీయమైన రాజకీయ పార్టీలు వుద్భవించాయి.

ఉదా :- మరాఠాల ప్రాబల్యంకల పేజంట్సు వర్కర్సు పార్టీ (మహారాష్ట్ర) జాట్, కూర్మీ కులాల ప్రాబల్యం కల భారతీయ క్రాంతిదళ్ (యు. పి.)

వివిధ ప్రాంతాలలోని 'చౌధురీ' కులాలను దాటి యింకా దిగువకు వెళ్ళితే కనుపించేవి వృత్తికులాలు ఉదా॥ మంగలి, చాకలి, సాలీ వగైరా. ఇవి దేశ వ్యాపితమైన కులాలే. వాటికి దిగువన కనుపించే హరిజనులూ దేశవ్యాపిత మైన వరాలవారే. అలాగే వనవాసులలో గూడా ఏకతా భావం కనుపిస్తుంది. ఈనాడు వీరు అందరూ గూడా చాలా వెనుకబడి వున్నందున, విద్యాగంధం లోపించి వున్నందున, ఆర్థికంగా శక్తిహీనులగుటవలన వివాహాదులలో తమ తమ ప్రాంతీయ పరిధులను దాటలేకపోతున్నా, ఆయా శ్రేణి కులాలమధ్య భావాత్మక ఏకతమాత్రం వున్నది. ఉదా॥ బీహారులోని మంగలి కులానికి చెందిన వ్యక్తి, తమిళనాడుకు చెందిన మంగలి కులస్థునిపట్ల ఆప్యాయతను కలిగేవుంటాడు.

ఈ దిగువ కులాలలో అత్యధిక భాగం గ్రామీణ కులాలేననే వాస్తవాన్నిగూడా విస్మరించరాదు.

కేంద్రీయాధికారం బలపడడమంటే దాని అర్థం వర్తమాన భారత రాజకీయాలలో సాంఘికంగా ద్విజులు బలపడడ మన్నమాట. అదేవిధంగా రాష్ట్రాలు బలపడడమంటే 'చౌధురీలు' (గ్రామీణ పెత్తందారీ కులాలు) బలపడడమని అర్థం. కాని, గ్రామరాజ్యం ఏర్పడడమంటే అర్థం బడుగు కులాలవారి చైతన్య వంతమైన నాయకత్వం బలపడడం కాగలదు. కనుక, అధికారం మధ్యతరగతి, భ్రాంతీయ కులాలవద్ద నిలచిపోకుండా యింకా దిగువ కులాలకు అందిన నాడు నిజమైన జాతీయైక్యత సాధ్యపడ్తుంది. ఈ కులాలవారు స్వీయ చైతన్యంతోనూ, వ్యాపక దృష్టితోనూ, తిరుగు బాటు జరపి అధికారం చేజిక్కించుకోవాల్సి వుంటుంది. ఈ తిరుగుబాటు ద్విజుల ప్రేరణ వలనగానీ, చౌధురీల ప్రేరణ వలనగానీ జరిగినట్లయితే ఆశించిన ఫలితంరాదు. ఎందువల్ల నంటే తిరుగుబాటుకు కావలసిన సమిధలుగా మాత్రమే బడుగు కులాలను వాడుకుని, తిరుగుబాటుయొక్క ఫలితాలను మాత్రం తాము అనుభవించే విధంగా కీలక స్థానాలను చేజిక్కించుకొనగల సామర్థ్యం ద్విజులకు, చౌధురీలకు గూడా- విశేషించి ద్విజులకు - చాలా ఎక్కువగా వున్నా

బడుగు కులాలు, చౌధురీ కులాలూ గూడా సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలోనే బలంగా వుంటాయి. మొదటివర్గం వ్యవసాయ కూలీలుగానూ, రెండోవర్గం భూ భూమాదులుగానూ వుండడం సర్వసామాన్యం. అందువలన

ఆర్థిక రంగంలో ఈ రెండు వర్గాలకూ మధ్య సహజమైన వైరుధ్యాలుంటాయి అవసరాన్నిబట్టి ధార్మిక రంగంలోని వైరుధ్యాలనూ, తమ సనాతన రూపాన్ని బహిర్గతం కానీయకుండా జాగ్రత్తపడుతూ ఈ రెండు వర్గాలమధ్యగల వైరుధ్యాలను వుపయోగించుకుని, బడుగుకులాల వారిని రెచ్చగొట్టి, చౌధురీలపై వారిని వినియోగించడానికే ద్విజులు ప్రయత్నం చేయడం సహజం. వారికా శక్తిగూడా వున్నది. అందువలన బడుగు జాతులవారు ఈ విషయమై చాలా అప్రమత్తతతో వ్యవహరించాల్సి వుంటుంది. కొంతకాలం క్రితం చౌధురీలు బ్రాహ్మణులపై జరిపిన తిరుగుబాటు నుండి తమకుగూడా ప్రయోజనం వుండకపోదని ఆశపడ్డారు, బడుగు కులాలవారు. ఆ యాశ చాలవరకు నిరాశకావడం జరిగింది. ఇప్పుడు చౌధురీలపై బ్రాహ్మణుల ప్రేరణతో తిరుగుబాటు చేసే స్థితికి బడుగుకులాలవారు వస్తున్నారు. కాని, ఈ ప్రయత్నంలోగూడా వారు నిరాశ చెందక తప్పదు. ఎందువల్లనంటే, యిది బ్రాహ్మణుల 'పునరుత్థానికి' మాత్రమే వుపయోగ పడగలదు. స్వీయ చైతన్యంతో, స్వీయ నేతృత్వంతో, వ్యాపకమైన దృష్టితో, సమగ్రమైన అవగాహనతో జరుగగల తిరుగుబాటు మాత్రమే సరియైన ఫలితాలను యివ్వగలుగుతుంది. సాంఘికంగా వెనుకబడివున్న ఈ కులాలవారు, తమ తిరుగుబాటు సాంఘికమైనదే గాక, ఆర్థికమైనదిగూడా వని గుర్తించాలి.

బడుగుకులా లనబడేవి సాధారణంగా పేదవర్గాలేనని మరువరాదు. వారిలో ఎవరో, ఎక్కడో ఒకరు ధనికుడు గానీ విద్యావంతుడు గానీ వుండకపోడు. కాని అది ప్రధానం కాదు. సాధారణ లక్షణాలు ప్రధానమైనవి. ఉదా॥ హరిజనులు ఎక్కువగా వ్యవసాయ కూలీలు. ముస్లిములు సాధారణంగా గుర్రంబండ్లు తోలుతూనో, చిన్న చిన్న ఫ్యాక్టరీలలో కార్మికులుగానో కనుపిస్తారు. వీరిలో అరుదుగా కనుపించే ధనికులనూ, విద్యాధికులనూ వేరుగా అంచనా కట్టవలసినదే. అయితే, అదే సమయంలో, వారిని ద్విజ - చౌధురీ కులాల ధనికులతోనూ, విద్యాధికులతోనూ సమాన స్థాయిలో చూడరాదు. "కులాలు-వర్గాలు"— ఈ రెంటి మధ్యా లతబద్ధలనూ గూడా సక్రమంగా వాడడం ద్వారానే సరి యైన అవగాహన సాధ్యం. సామాజిక తిరుగుబాటే గాక, ఆర్థిక వర్గపోరాటం సక్రమంగా సాగాలంటే గూడా ఈ బడుగు కులాలవాడు రాజకీయంగా ఒక్కచోటికి చేరడం ఎంతైనా అవసరం.

సమగ్ర దృష్టితో పోరాటం

కులవ్యవస్థపై జరిగే పోరాటం జయప్రదం కావడా నికై విస్తృత దృష్టిని అలవరచుకోవాల్సి వుంటుంది. కుల వ్యవస్థ వలన కేవలం కొన్ని బడుగుకులాల వారు, స్త్రీలూ మాత్రమే గాక ఉన్నత కులాలకు చెందిన పేదవారుగూడా

నలిగిపోతున్నారు. వారు ఈ వాస్తవాన్ని గ్రహించి బడుగు కులాల వారితో చేతులు కలపాల్సి వుంటుంది. అంతేకాదు ఈ కులవ్యవస్థ వలన జాతి మొత్తం నిస్తేజమై పోతున్నదని గ్రహించి, జాతియొక్క సమిష్టి ఔన్నత్యంకోసం కులవ్యవస్థపై తిరుగుబాటుకు పూనుకునే విద్యావంతులైన, వున్నత కులాల, సంపన్నులుగూడా వుండవచ్చును. వీరంతా పరస్పర ప్రేమ, సానుభూతి, అవగాహనలతో తిరుగుబాటును నడిపినప్పుడే అది సరియైన ఫలితాలను యివ్వగల్గుతుంది.

నూతనంగా అభివృద్ధిచెందే బడుగుకులాల వారు అగ్రకులాలవారి వలెనో, మధ్యకులాలవారి వలెనో ప్రవర్తించాలనే ప్రలోభంనుండి బయటబడటం చాలా అవసరం. అగ్రకులాల వారొకవైపున జంధ్యాలు తీసివేస్తూవుంటే వీరు మాత్రం క్రొత్తగా జంధ్యాలు తగిలిస్తున్నారు. అగ్రకులాల వారు తమ స్త్రీల ఘోషా పద్ధతులను క్రమంగా తొలగిస్తూ వుంటే వీరుమాత్రం క్రొత్తగా ఘోషా పద్ధతులు ప్రవేశపెడుతున్నారు. "ఎవరికివారు తమ ప్రత్యేకతను నిలబెట్టుకోవడానికి తంటాలు పడడమే దీనికి కారణం..." అంటారు, డా॥ లోహియా.

డా॥ లోహియా సారధ్యంలో 1959లో సోషలిస్టు పార్టీ తన కాశీ తీర్మానంలో యిలా పేర్కొన్నది:

"....గొప్పవారనబడే వారిని దిగువశ్రేణివారు అనుక రిస్తున్నారు. ద్విజులలోని చెడ్డగుణాలను వీరు అలవరచు కోనకాదు. ముఖ్యంగా భావిజీవితాన్ని నిర్మించుకోదలచిన వారు యీ విధంగా అనుకరించరాదు వెనుకబడిన తరగతు లకు చెందినవారు సత్శీలాన్ని అలవరచుకోవాలి. సంకుచిత భావాలను విడనాడకపోతే చెడ్డవారు పదవులలోనికి వస్తారు..."

అగ్రకులాలకు చెందినవారు ఈ తిరుగుబాటును తమ స్వీయ ప్రయోజనాలను దెబ్బతీసే సాధనంగా అర్థంచేసుకో రాదు, సమాజాన్ని పునర్జీవింప జేయడానికి తమకుగల శక్తి కొక సవాలుగా మాత్రం దీనిని స్వీకరించవచ్చును. ముఖ్యంగా యువతరం ఈ వైఖరిని తీసుకోవడం అవసరం. డా|| లోహియా యిలా వ్రాశారు

"అగ్రవర్ణాల యువతరం తాను ప్రజాసామాన్యపు జీవితం చిగిర్చి, పుష్పించడానికి ఎరువువలె వుపయోగపడా లని తనకు తానుగా నిర్ణయానికి రావాలి... బడుగుకులాల యువతరంమీద గూడా గురుతరభారం వున్నది. అగ్రకులాల వారి సాంప్రదాయాలు, ప్రవర్తనలమీద మోజు, శారీరక శ్రమపట్ల తిరస్కారభావం, స్వార్థం, ద్వేషం, అసూయ లాంటి వాటిని దరిచేరనీయ కూడదు జాతీయ నాయకత్వ భారమనేది పవిత్ర కర్తవ్యంగా భావించాలి. స్త్రీలు,

శూద్రులూ, హరిజనులు, ముస్లిములూ, ఆదివాసులూ మొదలైన వర్గాలవారి పవిత్ర కర్తవ్యం యీనాడు యిదే..."

కులవ్యవస్థపై జరిగే తిరుగుబాటు కేవలం ఏదో ఒక రంగంలో గాక అన్ని రంగాలలోనూ ఏకకాలమందు అత్యంత తీవ్రంగా సాగాల్సివుంది. ఆర్థిక రంగంలోనూ, సామాజిక రంగంలోనూ, ధార్మిక రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ గూడా ఈ తిరుగుబాటు సాగాల్సి వుంటుంది. అలాగాక, ఏదో ఒక్క రంగానికే పరిమిత మైనట్లయితే గతంలో సాగిన తిరుగుబాట్లు వలెనే విఫలంకాక తప్పదు.

వాలుగు వైపులా దాడి

కులవ్యవస్థను నిర్మూలించడానికై సాగే కృషి వివిధ రంగాలలోనూ స్పష్టమైన కార్యక్రమాలను ఆధారంగా చేసుకొని సాగాల్సివుంది.

ధార్మిక రంగంలో మూఢాచారాల తిరస్కారం అతి ముఖ్యమైనది. మన అనుభవంలోనికి రాగలవాటిని మించిన పరతత్వం ఏదో వున్నదనే భ్రమను తిరస్కరించాల్సి వున్నది. హేతువాదానికీ, తర్కానికీ, అనుభూతికీ అందని వాటిమీద ఆధార రహితమైన అంధవిశ్వాసం పెంచుకోవడ మనేది అనర్థహేతువు. అందువలన అది తిరస్కరించబడి

తీరాలి. వాటిని తిరస్కరించడంతో కులవ్యవస్థను పవిత్రమైనదిగా, న్యాయమైనదిగా— దేవుని పేర, పరలోకము పేర, కర్మసిద్ధాంతము పేర భారతీయులచేత నమ్మించుతూ వచ్చిన మతం తన ఆధారాన్ని కోల్పోయింది. ఈ హేతువాదదృష్టి కులవ్యవస్థపై సాగే తిరుగుబాటుకు తాత్విక పునాదిని నిర్మిస్తుంది.

సాంఘిక రంగంలో ఈ తిరుగుబాటు సహపంక్తి భోజనాలు మొదలు వర్ణాంతర వివాహాల వరకూ వివిధ కార్యక్రమాలను చేపట్టాలి. అన్ని కులాలకు చెందిన ప్రభుత్వోద్యోగులూ నెలకొకసారియైనా ఒకే పంక్తిలో కూర్చొని ఒక కడజాతివాని చేతి వంటకాన్ని భుజించడం తప్పనిసరి కావాలి. అయితే— యింతకంటె ప్రధానమైనది అంతర్వర్ణ వివాహాలు జరుపడం. అంతర్వర్ణ వివాహాలు చేసుకునే యువతీయువకులకు వారి వారి కులాలకు బదులుగా మొత్తం సమాజమూ, సమాజంయొక్క ప్రతినిధిగా ప్రభుత్వమూ హామీ యివ్వాల్సి వుంటుంది. అది వివిధ రకాల అలవెన్సుల రూపంలో వుండవచ్చును. ప్రభుత్వోద్యోగాలకు అంతర్వర్ణ వివాహమనేది ఒక అదనపు అర్హతగా పరిగణించ బడాలి. అంతర్వర్ణ వివాహాలనేవి కేవలం యవ్వనోద్రేకంలో జరిగిపోయిన తొందరపాటు పనులుగా భావించబడ కుండా వుండడానికి తగిన ఏర్పాటును ప్రభుత్వం చేపట్టాలి. అంటరాని తనాన్ని, కులవివక్షతనూ పాటించేవారిని సాంఘికంగా వెలివేసే పరిస్థితి రావాలి.

ఆర్థిక రంగంలో కులవ్యవస్థపై తిరుగుబాటనేది వెనుక
బడిన కులాలవారు సాధారణంగా ఆర్థికంగా పేదవారేనన్న
అవగాహనతో ప్రారంభం కావాలి. భూములులేని పేదవారికి
భూ వసతి కల్పించడం కొరకు జరిగే పోరాటాలు కులవ్యవ
స్థపై జరిగే పోరాటాలలో భాగంగా స్వీకరించబడాలి
భూముల పునర్విభజన కొరకు భూసేనల నిర్మాణంద్వారా
సాగుకు లాయక్కై సాగు చేయబడకుండా వున్న భూములను
సేద్యంలోనికి తేవడానికీ, వ్యవసాయ కూలీలకు కనీసకూలి
రేట్లు నిర్ణయించడానికీ జరిగే కృషి యావత్తూ కులవ్యవస్థపై
జరిగే చతుర్ముఖమైన దాడిలో భాగంగా సాగాలి. దళిత
కులాలలో కొన్ని కులాలు ప్రత్యేకంగా చిన్న చిన్న వ్యవ
సాయ కమతాలు సాగుచేసుకుంటూ జీవించడం
చూస్తున్నాం. అందువలన లాభసాటిలేని కమతాలమీద
భూమిస్తును రద్దుచేయడమనే నినాదం ఈ వర్గాలవారికి
ఆర్థిక రంగంలో ప్రధాన నినాదం తేగల్గుతుంది. అదే
విధంగా వివిధ వృత్తులమీద బ్రతికేవారు వారి వారి జీవన
స్థాయిని పెంపొందించుకోవడానికి జరిపే పోరాటాలు- ఉదా॥
చేనేత పారిశ్రామికులు— యావత్తూ ఒక సమగ్రమైన
పోరాటంలో భాగాలుగా చూడబడుతూ, ఒకదాని కొక
సహాయకారి కావాలి. ఒంటరొంటరిగా జరిగే పోరాటాల
స్థానంలో సమన్వయీకృతమైన, సంఘటితమైన పోరాటా
లను నిర్మించాల్సి వుంటుంది. ఈ తరగతికి చెందిన వివిధ
కులాలవారు తమలో ప్రతి ఒక్కరి కొరకు మిగతావారు
గూడా పోరాడే పద్ధతిని అలవరచుకోవాలి.

రిజర్వేషన్లు

రాజకీయ రంగంలో అగ్రకులాలవారి చేతినుండి పరిపాలనాధికారాలను అందరికీ అందుబాటులోనికి తేవడానికి పోరాటం సాగాల్సి వుంటుంది. అది జరుగనిదే మిగిలిన పోరాటాలు ఫలప్రదం కాజాలవు. అందుకు రాజకీయాధికారానికి సంబంధించిన స్థానాలలోనూ, ప్రభుత్వోద్యోగాలలోనూ నూరింట అరవై స్థానాలను వెనుకబడిన తరగతుల కొరకు ప్రత్యేకించాలి. శూద్ర, హరిజన, ఆదివాసి కులాల వారితోపాటు ముస్లిములలోని దళిత వర్గాల వారినీ, అన్ని కులాలకు చెందిన స్త్రీలనూ కూడా వెనుకబడిన తరగతికి చెందిన వారుగా వ్యవహరించాలి. బ్రాహ్మణ స్త్రీలతో సహా అన్ని కులాలలోని స్త్రీలుకూడా మతపరమైన హక్కులనుగానీ, ఆస్తి హక్కులనుగానీ లేకుండా యింతకాలంగా అణచివేయబడి వుండడమే దీనికి కారణం. అలా ప్రత్యేకించబడిన స్థానాలలో అర్హతల పేరిట అగ్రవర్ణాల వారిని యిరికించే ప్రయత్నం జరుగరాదు. అరవై శాతం స్థానాలనగానే నలభైమంది శక్తివంతులైన వారికి కేవలం తోకలుగా వుండే అరవైమందిని ఈ దళిత వర్గాల నుండి జోడించడమని అర్థంకాదు. రాజకీయంగా నాయకత్వ స్థానాలు బడుగు కులాలవారికి యివ్వబడాలి. సత్తాయొక్క సారము బడుగు జాతుల వారికి అందాలి.

అర్హతల పేరిట ఈ విధానాన్ని అనేకమంది ఎదురొక్కవడం జరుగుతున్నది. సాంఘికంగా వేల సంవత్సరాలుగా అత్యంత అమానుషంగా అణచివేయబడుతూ, మానవులుగా కూడా పరిగణనలో లేని స్థాయికి త్రొక్కివేయబడిన కులాలనేకం వున్న భారతదేశంలో సమానావకాశాల సిద్ధాంతం అభివృద్ధి నిరోధకమైనదే కాగలదు. వేల సంవత్సరాల కులవ్యవస్థ మూలంగా సామర్థ్యమూ, అర్హత, సంస్కారమూ కొన్ని కులాలవారి గుత్తగా మారిపోయాయి. విద్య, సంపద, అధికారమూ అగ్రకులాలకే పరిమితమై పోయాయి. కనుక ఈ అగ్రకులాల వారికీ, బడుగుకులాల వారికీ కూడా ఒకే కొలతబద్దను వాడడం సరియైన పద్ధతి కాజాలదు.

బడుగు వర్గాల వారిలోని సృజనశక్తి కప్పివేయబడి వున్నది. చేనుకు ఫదును పెట్టినట్లే మెదడుకు కూడా పదును పెట్టడం అవసరం. మొద్దుబారిపోయివున్న వారిలో అంతర్నిహితమైన శక్తిని సాధన ద్వారా వెలికి తీయాల్సివుంటుంది. అందుకు అర్హతలతో నిమిత్తం లేకుండా యీ వర్గాల వారిని నాయకత్వ స్థానాలలోనికి పంపడమనేది ఎంతైనా అవసరం. అనుభవము, అర్హతలూ లేకుండ హఠాత్తుగా బాధ్యతలు వహించడపడిన కారణంగా కొన్ని చిన్న చిన్న తప్పులు జరుగవచ్చును. కాని వారుగూడా ఆ స్థానాలకు, బాధ్యతలకూ అలవాటుపడి సమర్థులుగా రూపొందడానికి ఎంతో కాలం మాత్రం పట్టదు.

ఈ ప్రత్యేకావకాశాల విధానంపై కొన్ని స్పష్టీకరణలు అవసరం. లేనట్లయితే యీ విధానం అనేకమైన అపార్థాలకు దారితీసే ప్రమాదం వున్నది.

విద్యా సంస్థలలో సీట్ల విషయంలో యీ రిజర్వేషన్ల పద్ధతి పనికిరాదు. ఏ విద్యార్థి ఏది చదువులో దలచినా అవకాశం వుండాలి. ఆ విధంగా విద్యా సంస్థలలో సీట్ల కొరకు ఏర్పాట్లు జరగాలి, ప్రభుత్వోద్యోగాలలో మాత్రం రిజర్వేషను పద్ధతి తప్పనిసరిగా అనుసరించాలి. ప్రమోషన్లకు కూడా దీన్ని అన్వయింప జేయాలి. అగ్రకులాలకు చెందిన విద్యావంతులు ప్రభుత్వేతర రంగాలలో తమ అదృష్టాన్ని వెతుక్కోవచ్చును.

వెనుకబడిన కులాల జాబితా శాశ్వత మైనదిగా వుండదు. ఒక్కొక్క దశలో, ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క కులం ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో ప్రగతిని సాధించి ముందుకు వెళ్తాయి. (ఉదా॥ తెలుగునాట కమ్మవారు) ఆ కులాలు ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందిన కులాల జాబితాలోనికి చేర్చివేయబడుతూ వుండాలి. వెనుకబడిన తనమనేది మత ధర్మము, సాంఘిక స్థాయి, ఆర్థిక పరిస్థితి, రాజకీయాధికారమూ అనే నాలుగు కొలతలనూ పరిగణనలోనికి తీసుకున్న మీదట నిర్ధారణ చేయబడాలి.

ప్రత్యేకావకాశాలు, లేదా రిజర్వేషను అనేది వెనుకబడిన వర్గాలకు మొత్తంగా ఏర్పాటు చేయబడాలేగాని

ఫలితానికి ఆ కులం వేర్వేరుగా స్థానాల కేటాయింపు జరుగ రాదు. యాదవులకు యిన్ని స్థానాలు, గౌడులకు యిన్ని స్థానాలూ— అంటూ కేటాయించే పద్ధతి కొన్ని అధిక సంఖ్యాక కులాలవారి ప్రాబల్యం పెరిగేందుకు వుపయోగ పడుతుంది. అంతేగాక, వెనుకబడిన తరగతులలో అనైక్య తకు గూడా దారితీస్తుంది. అందువలన కేటాయింపనేది వెనుక బడిన వర్గాలకు మొత్తంగా జరగాలి.

డా॥ లోహియా విశిష్టత

"అణచివేయబడిన యీ బడుగు కులాలవారిని పైకి తీసుకు రావడానికి వుద్దేశించిన విధానం ఎంతో దావా నలాన్ని సృష్టించవచ్చును... అగ్రవర్ణాలవారి ద్వేషం దొరికినంత సులువుగా దీనికి బడుగుకులాలవారి మద్దతు లభ్యం కాకనూ పోవచ్చు.... శూద్రులు మేల్కొనే లోపు గానే యీ నూతన విధానాన్ని అమలుపాలు చేయడానికి నేర్పరులైన అగ్రవర్ణాలవారు పూనుకోగలరు... తక్కువ కులాలలో అధిక సంఖ్యాకులైన చమార్, అహిర్ వగైరా కులాలవారు యీ విధానంమొక్క మొత్తం ఫలితాలను తమ కులాలకే పరిమితం చేసుకోవడానికి ప్రయత్నించ వచ్చును. బడుగు కులాలకు చెందిన కొందరు స్వార్థపరులు వీటిని తమ వ్యక్తిగత స్వార్థంకొరకు వుపయోగించుకోనూ వచ్చు.... ద్విజ—శూద్ర కులాలమధ్య హింసాయుత సంఘ

ర్షణలూ అధికం కావచ్చును..." అంటూ యీ విధానం సృష్టించగల తుఫానులను వివరించాడు, డా॥ లోహియా. ఆయనే యింకా యిలా వ్రాశారు:

"....అయితే, యీ ప్రమాదాల వలన కలిగే భయం, అత్యంతాద్భుత శక్తిగల ఈ పరిష్కార విధానం పట్ల మనలను గ్రుడ్డివారిని చేయరాదు.... భారతదేశం తన చరిత్రలో ఎన్నడూ చూడని విప్లవాన్ని చూడగల్గుతుంది. ప్రజలు చైతన్య పూరితులవగల్గుతారు మానవాళికే ఒక నవ్య సందేశాన్ని అందించగల స్థాయికి యీ దేశం చేయగలదు..."

కార్ల్‌మార్క్స్ మానవజాతి యొక్క చరిత్రగతిని వ్యాఖ్యానించాడు. తుదకు వర్గరహిత సమాజం ఏర్పడేటందుకు మార్గాన్ని వివరించాడు. కాని అర్థికంగా సమాజాలో ఏర్పడే యీ వర్గాలు కులాలుగా మారగల శక్తి గలిగినవని ఆయన గుర్తించలేదు. ఈ కులాలు అన్నిచోట్లా గూడా భారతదేశంలో వున్నంత వుక్కు చట్రాలవలె రూపొందక పోవచ్చును. కాని, కనీసం చలన రహితమైన వర్గాలుగా యివి తరచు రూపొందుతూనే వచ్చాయి. వర్గాలు కులాలుగా, కులాలు వర్గాలుగా పరిణామం చెందడమనేది ప్రపంచ చరిత్రలో విస్మరించరాని అంశం. ఈ విషయాన్ని అవగాహన చేసుకున్నవాడు డా॥ లోహియా.

భారతదేశంలో సోషలిస్టు ఉద్యమాన్ని నిర్మించిన వారిలో ఒకరు డా॥ రామమనోహర లోహియా. ఆయన కార్ల్ మార్క్సునుగానీ మరొకరినిగానీ యథాతథంగా ఆమోదించలేదు, స్వీకరించలేదు. ప్రశ్నించడం, తర్కించడం, అన్వేషించడం— ఆయన పద్ధతి. అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడటం ఆయన జీవితం. కులవ్యవస్థపై శతాబ్దాలుగా సాగుతూ వుండిన అనేక తిరుగుబాట్లు, పోరాటాలూ, సంస్కరణోద్యమాలూ ఎందుకు విఫలమైనాయనే విషయమై తీవ్రంగా పరిశోధించి ఆయన రూపొందించిన యీ విధానం ఎంతో శక్తివంతమైనది. ఇది సరిగా అవగాహన చేసుకోబడి, అమలు జరుపబడినట్లయితే ప్రపంచంలో కులాలనూ, వర్గాలనూ గూడా ఏక కాలంలో నిర్మూలించడానికి తగిన అవకాశం మొట్టమొదటి సారిగా లభిస్తుందన్న మాట.

పటిష్టమైన తాత్విక పునాదులమీద, సరియైన చారిత కావగాహనతో ధార్మిక— సామాజిక— ఆర్థిక— రాజకీయ రంగాలలో ఏక కాలమందు సాగగల యీ తిరుగుబాటు మాత్రమే కులవ్యవస్థను నిర్మూలించగలదు.

సమాప్తం

1704

Book Number	AIPR01B309	Date	29/3/23
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	C1, 4, 8, 103		
Missing Pages	NO		
Prepared By	Sandhya	Cutting By	Sandhya
Scanned By	Mounika	Pages	115